

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు ఆవశ్యం.



# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 260 • పేజీలు : 8 • బుధవారం 12 జూన్ 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati


- స్టేట్ ఫస్ట్ అన్నదే మన నినాదం..
- అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తాం..
- కక్ష సాధింపు చర్యలకు పూర్తిగా దూరం
- తప్పచేసిన వారిని మాత్రం వదిలేది లేదు..
- ప్రజలు ఇచ్చిన తీర్పుతో సమిష్టి కృషి చేస్తాం
- శిథిలమైన రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు మళ్లిస్తా
- ఆర్థిక రాజధానిగా విశాఖపట్టణం అభివృద్ధి
- పోలవరం పూర్తి చేస్తాం..ప్రాజెక్టులతో పొలాలకు నీళ్లు రప్పిస్తాం
- కేంద్రంలో ఏపికి మూడు పదవులతో సముచిత స్థానం దక్కింది..
- ఎన్డీయే పక్షనేతగా ఎన్నికయ్యాక బాబు కీలక ప్రసంగం



# మన రాష్ట్ర రాజధాని అమరావతే

**అమరావతి, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇవ్వని తీర్పును ప్రజ లు ఇచ్చారని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. అందుకు అనుగుణంగా స్టేట్ ఫస్ట్ అన్న విధానంతో ముందుకు పోతామని చంద్రబాబు అన్నారు. సిఎం అయినా ఎవరైనా అంతా ఒక్కటేనని, ప్రజలే మనకు ముఖ్యమని అన్నారు. తెదేపా-జనసేన-భాజపా కూటమి శాసనసభా పక్ష భేటీ విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో ఎన్డీయే శాసన సభా పక్ష నేతగా

మిగతా 7లో



# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో బాబు భేటీ

- మద్దతు లేఖల సమర్పణ..ప్రమాణానికి అనుమతి
- అంతకుముందే గవర్నర్‌ను కలిసిన కూటమి నేతలు
- ఎన్‌డిఎ నేతగా చంద్రబాబును ఎన్నుకున్న లేఖ అందజేత

7లో





## ఒడిషా సిఎంగా మోహన్ మాఝి

**భువనేశ్వర్, జూన్ 11 :** ఒడిశా కొత్త ముఖ్య మంత్రిగా గిరిజన నేత మోహన్ చంణ్ మాఝి

మిగతా 7లో



## జనసేన పక్ష నేతగా పవన్



7లో



# నేడు ఏపికి మోదీ

- చంద్రబాబు ప్రమాణానికి మోదీ రాక
- మోదీతో పాటు అమిత్ షా పర్యటన ఖరారు
- మోదీ రాకతో భారీగా బందోబస్తు ఏర్పాటు
- పలువురు ఎన్‌డిఎ పాలిత సిఎంల రాక
- తెలంగాణ సిఎం రేవంత్‌కు ఆహ్వానం లేనట్లే..

**అమరావతి, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ పర్యటన ఖరారైంది. ఈనెల 12న కేసరపల్లి ఐటి పార్కు ప్రాంగణంలో జరిగే

మిగతా 7లో

# నీట్ పరీక్ష రద్దు చేయడం కుదరదు

- దానికున్న ప్రతిష్టను దెబ్బతీయడమే అవుతుంది..
- నీట్ అక్రమాలపై పిటిషన్‌ను విచారించిన సుప్రీం
- విచారణను జులై 8కి వాయిదా వేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ, జూన్ 11 :** వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ - 2024 పరీక్షలో అవతవకలు జరిగినట్లు గత కొన్ని రోజులుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్న క్రమంలోనే నీట్ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలైంది. దీనిపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అమనుల్లాతో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ

మిగతా 7లో





















ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# మా 'తెలుగు'తల్లికి..

"మా తెలుగుతల్లికి మల్లెపూదండ..." అంటూ మన తెలుగుతల్లిని కీర్తించాడు సుందరకవి శంకరంబాడి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రగీతాన్ని అందించిన మహనీయుడు.ఆ స్ఫూర్తితో కొత్తగా అధికారం లోకి వస్తున్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తెలుగు భాషాసంస్కృతుల వికాసానికి అంకితమై పనిచెయ్యాలని ఆకాంక్షిద్దాం. ఈ సందర్భంలో శంకరంబాడిని తలపుల్లో నిలుపుకుందాం. శంకరంబాడి మాతృభాష తమిళం.తిరుపతి దగ్గర తిరుచానూరులో తమిళ కుటుంబంలో పుట్టాడు. అక్కడ తెలుగు,తమిళం అక్కాచెల్లిలాగా కలిసి సాగుతాయి కాబట్టి, సుందరాచారి తెలుగుభాషకు బాగా దగ్గరయ్యాడు.తెలుగు పదాలు, పద్యాలు,కవిత్వం అతన్ని బాగా ఆకర్షించాయి.పద్యాల్లో కూడా తేటగీతి అంటే చాలా ఇష్టం. గీతంగా మనం పాడుకొనే 'మా తెలుగుతల్లికి..' రచన తేటగీతి పద్యాల సమాహారం.ఈ పాట 1942లో రాశాడు.ఈ పాట పుట్టి కూడా దశాబ్దాలు దాటిపోయింది. ఈయనది మొదటి నుంచీ విభిన్న వ్యక్తిత్వం.స్వేచ్ఛా ప్రియుడు. స్వతంత్ర భావాలు ఎక్కువ. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన ఈయన సంధ్యావందనాలు వంటి వైదిక కార్యక్రమాలు చేసేవాడు కాదు.తండ్రి మందలించేసరికి,జంధ్యాన్ని తెంచిపారేసి,ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయాడు.అప్పటికే ఇంటర్మీడియట్ వరకూ చదువుకొని ఉన్నాడు.బతుకుదెరువు కోసం హెూటల్ లో సర్వర్ గా,రైల్వేస్టేషన్ లో కూలీగా,రకరకాల చిన్నాచితక పనులన్నీ చేశాడు.వీటన్నంటితో విసిగిపోయి,మద్రాస్ వెళ్ళాడు. 'ఆంధ్రపత్రిక' ఆఫీస్ కు వెళ్లి, నేరుగా కాశీనాథుని నాగేశ్వరావుపంతులును కలిశాడు.ఉద్యోగం కావాలని అడిగాడు.ఇతని వాలకం ఎట్లా ఉన్నా,భాషను చూసి వెంటనే ఆంధ్రపత్రికలో ఉద్యోగం ఇచ్చారు. ఆంధ్రపత్రికలో ఉండగా, ఒక ప్రముఖునిపై పద్యం రాయవలసి వచ్చింది. నేను వ్యక్తులపై పద్యాలు రాయనని ఆ ఉద్యోగం వదిలించుకొని మళ్ళీ రోడ్డున పడ్డాడు.ఎలాగో,బి.ఏ పూర్తి చేశాడు.ఇన్స్పెక్టర్ అఫ్ స్కూల్స్ గా కొంతకాలం పనిచేశాడు. అక్కడ కూడా ఆత్మగౌరవం దెబ్బతిని ఆ ఉద్యోగాన్నీ వదిలేశాడు.పెళ్లి చేసుకొని, సంతానాన్ని కన్నాడు.వారు అనారోగ్యంతో మరణించే సరికి మానసికంగా ఇంకా దెబ్బతిన్నాడు. దేశదిమ్మరిగా మారాడు.ఇవన్నీ ఎలా ఉన్నా,కవిత్వాన్ని ఎన్నడూ వీడలేదు.విభిన్నమైన విలక్షణమైన కవిత్వాన్ని సృష్టించాడు. అన్నీ రసగుళికలే. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి,రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ,రాయప్రోలు సుబ్బారావు,విశ్వనాథ సత్యనారాయణ మొదలు ఎందరో మహామహులకు శంకరంబాడి కవిత్వమంటే చాలా ఇష్టం. మాడభూషి అనంతశయనం అయ్యగారి వంటి పెద్దలతో ఇతనికి స్నేహం కూడా ఉండేది. 'మా తెలుగుతల్లికి' రచన ఒక సినిమా కోసం రాసింది. కానీ,ఆ సినిమావాళ్ళు దీన్ని తీసుకోలేదు.టంగుటూరు సూర్యకుమారి పాడి,రికార్డు చేసిన తర్వాత దీనికి ఎంతో ప్రఖ్యాతి వచ్చింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చారిత్రక,సాంస్కృతిక వారసత్వాన్ని కవిత్వంలో రంగరించి ఈ గీతంలో మలిచాడు.ఈ పాట ఎప్పుడు విన్నా,ఒళ్ళు గగుర్పొడుస్తుంది. అంతటి శక్తి ఈ రచనలో ఉంది. ఒకసారి ఢిల్లీ వెళ్లి జవహర్ లాల్ నెహ్రూను కలిసి,తను రాసిన 'బుద్ధచరిత్ర'లోని ఒక పద్యాన్ని ఇంగ్లిష్ లోకి అనువదించి,ఆయనకు వినిపించాడు.నెహ్రూ ముగ్ధుడై, 500రూపాయలు బహూకరించి, ఘనంగా సత్కరించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన 'గీతాంజలి'ని కూడా అనువదించాడు.మక్కికిమక్కి అనువాదం కాక,మూలంలోని భావాన్ని తీసుకొని, తెలుగు నుడికారంతో అనుసృజన చేశాడు.దీనికి ఎంతో పేరు వచ్చింది. మహాత్మాగాంధీ మరణించినప్పుడు 'బలిదానం' అనే కావ్యం రాశాడు. ఆ కావ్యాన్ని అతను పాడి వినిపిస్తుంటే,వినేవారు కన్నీళ్ల జలపాతాలు రాల్చేవారని ప్రముఖ కవి పులికంటి కృష్ణారెడ్డి ఒక సందర్భంలో రాశారు. సుందరరామాయణం, సుందరభారతం కూడా రాశాడు. పేరుకు తగ్గట్టుగా అవి సుందర సుమధుర కావ్యాలే.జానపద గీతాలు కూడా రాశాడు. స్థలపురాణాలూ రాశాడు. మహాత్మాగాంధీ,దీనబంధు, బిల్హణీయం మొదలైన సినిమాలకు పాటలు రాశాడు.'దీనబంధు' సినిమాలో నటించాడు కూడా. "శంకరంబాడి సుందరాచారి, అనే నా పేరు కూడా తేటగీతిలో ఇమిడిపోయింది",అంటూ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మతో చమత్కరించేవాడు.కవిత్వంలో తేట ఉండడమే కాక, చెప్పాలనుకున్నది తేటతెల్లంగా చెప్పడం కూడా శంకరంబాడి నైజం. కటికి పేదరికం,మానసికమైన అశాంతి మధ్య,మద్యానికి బానిసయ్యాడు.62ఏళ్ళ వయస్సులో,1977లో,ఈ లోకాన్ని వీడి వెళ్ళిపోయాడు. గొప్ప భావుకుడు.గొప్ప కవి. నిష్కల్మషమైన వ్యక్తి.ఇంకా ఎంతో పేరు రావాల్సిన కవి శంకరంబాడి. తన సమకాలీన జీవితంలో, పెద్దల దగ్గర,పిన్నల దగ్గర మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. విలక్షణమైన రచనలు చేశాడు. కవిగా గెలిచాడు.జీవితంలో ఓడిపోయాడు."తేటగీతుల తీపి రుచుల ఊట – శంకరంబాడి పాట". ఆ మహనీయ కమనీయ కవికి కైమోడ్పులు అందిస్తూ తెలుగు తిలకం దిద్దుకుందాం .

# బాలల సంక్షేమమే సమాజ సంక్షేమం

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం , వివిధ దేశాలలో చట్టాలు ఎన్ని చేసినా అవి అమలుకు నోచుకోవడం లేదు. ఐక్యరాజ్య సమితి ప్రత్యేక విభాగమైన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2002లో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంను ప్రారంభించింది.ప్రపంచంలో అసంఘటిత రంగంలో బాల కార్మికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఉదాహరణకు ఇళ్లలో పనిచేసే బాలలు. వాస్తవానికి అనేక సందర్భాల్లో బాలకార్మిక వ్యవస్థ ప్రభుత్వ లెక్కల్లోకి రాదని కూడా జాతీయ బాలల హక్కుల కమిషన్ పేర్కొంటోంది. యునిసెఫ్ ప్రకారం దాదాపు సగంమంది ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడి మాని వేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55% షెడ్యూల్డ్ తెగల్లో 63% దాకా ఉందని అంచనా. బడి మానేసిన ప్రతి పిల్లవాడూ అనివార్యంగా బాలకార్మికుడిగానే జీవిస్తున్నాడని వివిధ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ఫలితంగా బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు పెరుగు తున్నాయి. 2005 నాటికి జాతీయ బాలల కార్యాచరణలో భాగంగా బాల కార్మిక వ్యవస్థ నిషేధంతో పాటు బాల్య వివా హాలను పూర్తిగా నిరోధించాలని లక్ష్యంగా పెట్టు కున్నారు. కానీ, ఈ లక్ష్య సాధనలో విఫలమయ్యాం. ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం జరుపు కుంటున్నా ప్రయోజనం లేకుండా పోయింది. అందమైన బాల్యాన్ని లేకుండా చేయడం అతి పెద్ద మానవ హక్కుల ఉల్లంఘన.బాలకార్మిక వ్యవస్థను రద్దు చేయాలన్నా లేదా బాల్య వివాహాలను పూర్తిగా నిషేధించాలన్నా ముందు జరగాల్సింది సార్వత్రిక ప్రాథమిక విద్యను అందుబాటులోకి తేవడం. అందుకే విద్యను ప్రాథమిక హక్కుగా చేశారు. చట్టం అమల్లో భాగంగా బడి బయట ఉన్న పిల్లలను, మధ్యలో మానేసిన వారిని తిరిగి బడిలో చేర్పించడం సవాలుగా మారింది. విద్యా హక్కు చట్టం హామీ ఇచ్చినవిధంగా వీరందరికీ వాళ్ల వయసుకు తగిన తరగతిలో చేర్పించి విద్యనం దించడమూ ఒక సవాలే. మధ్యలో బడి మానేయకుండా చూడటానికి ఎనిమిదో తరగతి వరకూ పిల్లలకు డిటెన్షన్ పద్ధతి ఉండకూడదనిబీ వీరిని సమగ్ర, నిరంతర మూల్యాంకన పద్ధతి ద్వారా పరీక్షించాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. నాణ్యమైన విద్యనందించడం ద్వారా ప్రతి ఒక్కరూ అవసరమైన స్థాయిలో చదువు నేర్చుకుని, తర్వాతి తరగతిలోకి ప్రవేశించ గలిగేలా చేయాల్సిన బాధ్యత పాఠశాలపై ఉంటుందనీ చట్టం పేర్కొంటోంది. బాలలు బాల కార్మికులుగా మారకుండా చేసేందుకు విద్యాహక్కు చట్టంలో అనేక ఇతర నిబంధనలూ ఉన్నాయి. విద్యా సంవత్సరంలో ఏ సమయంలో వచ్చినా తగిన తరగతిలో చేర్చుకోవాలి. అవసరమైన అదనపు శిక్షణ ఇవ్వాలి. దండన లేని బోధన అందించాలి. బడిలో ఉండాల్సిన పిల్లలు అందులో చేరక పోవడానికి, మధ్యలో బడి మానేసి బయట ఉండటానికి తల్లిదండ్రుల పేదరికం, సామాజిక వెనక బాటుతనం పిల్లలకు అనుకూలంగా లేని బోధనాంశాలు, బోధనా ప్రణాళిక తదితర కారణాలు ఉన్నాయి.భారత రాజ్యాంగంలోని 24, 39, 45వ అధికరణలు పిల్లలకు శ్రమ దోపిడీ నుంచే కాకుండా ఇతర రక్షణలనూ కల్పిస్తున్నాయి. వయసుకు తగని ఆర్థిక కార్యకలాపాలు, వృత్తుల్లో పని చేయకుండా భారత రాజ్యాంగం పిల్లలకు రక్షణ కల్పిస్తోంది. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి భారత ప్రభుత్వం త్రిముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. మొదటిది: బాల కార్మిక చట్టాల అమలు రెండోది: బాలల సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పన, అమలు మూడోది: బాల కార్మిక వ్యవస్థ అధికంగా ఉన్న ప్రదేశాలు, రంగాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనా పథకాలను అమలు చేయడం. 1986లో చేసిన బాల కార్మిక వ్యవస్థ నిషేధ, నియంత్రణ చట్టం నోటిఫై చేసిన ప్రమాదకర వృత్తుల్లో బాలకార్మికులుం డటాన్ని నిషేధిస్తోంది. ప్రస్తుతం ఇలాంటి 18 ప్రమాదకర వృత్తులను, 65 ప్రమాదకర ప్రక్రియలను గుర్తించారు. రాజ్యాంగంలోని 24, 39, 45వ అధికరణలు పిల్లలకు శ్రమ దోపిడీ నుంచే కాకుండా ఇతర రక్షణలనూ కల్పి స్తున్నాయి. బాలలు ఆరోగ్యంగా జీవించే హక్కు వుంది, సామాజిక భద్రత పొందే హక్కువుంది. ఉచిత నిర్బంధ విద్యను పొందడం బాలల హక్కు. బాలలకు విశ్రాంతిగా వుండే హక్కువుంది. ఆటలు వినోద కార్యక్రమాల్లో పాల్గొనే హక్కు వుంది. ప్రమాదకరమైన పనులు గనుల్లో, పేలుడు పదార్థాల తయారీలో, హెూటళ్ళలో బాలల్ని పని చేయించరాదు. మారక ద్రవ్యాల నుండి బాలలను దూరం చేయాలి. వారికి అందుబాటులో వుంచడం, వారి ద్వారా తెటప్పించు కోవడం నేరం. బాలల్ని నిర్బంధించరాదు. లైంగిక ధూషణ చేయరాదు. బాలల సంక్షేమానికై దోపిడి ఏ రూపంలో వున్నా ప్రభుత్వాలు నిషేధించాలి. 18 సంవత్సరాలలోపు వయస్సు బాలల్ని విడుదల చేయటానికి వీలులేని నేరాలకు ఉరి శిక్షగాని, యావజ్జీవ శిక్షగాని విధించరాదు.భారత దేశంలో పుట్టిన 12 మిలియన్ల బాలికల్లో 3 మిలియన్ల మంది తమ 15వ పుట్టిన రోజును, తమ మొదటి పుట్టిన రోజును జరుపుకోకుండానే మరణిస్తున్నారు.

# మానవతావాది యం.వి.పాపన్న గుప్త



ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించారు. తండ్రి మరణంతో సంపన్న కుటుంబం చిన్నాభిన్నమై పోయింది. చదువుకు స్వస్తి పలికారు. ఉద్యోగంలో చేరారు. దేశాభిమానం వెన్నుతట్టింది. ఉద్యోగానికి ఉద్వాసన పలికారు. ఉద్యమాల్లో పాల్గొన్నారు. హరిజన, గిరిజన కుటుంబాలకు ఆలయాల్లో ప్రవేశించేందుకు ప్రయత్నాలు చేశారు. అభివృద్ధి కార్యక్రమాల వైపు దృష్టి సారించారు. ప్రయివేటు బ్యాంకుల ఏర్పాటుకు కృషి సల్పారు. రచయితగా గుర్తింపు పొందారు. 332 పేజీల నవలను ముద్రించి రూపాయిన్నరకు అమ్మించారు. జిల్లాలు దాటి వెళ్లి కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాజకీయాల వైపు దృష్టి సారించకుండా పదవులు కూడా అందుకున్నారు యం.వి. పాపన్న గుప్త. వీరి పూర్తి పేరు మొగిలి వెంకట పాపన్న గుప్త. 1905 జూన్ 12న జన్మించారు. చిత్తూరు జిల్లా మదనపల్లె వీరి జన్మస్థలం. తల్లి రామలక్ష్మమ్మ, తండ్రి కృష్ణయ్య. బ్రిటిష్ అధికారుల మన్ననలందుకుంటూ తహశీల్దారుగా కొనసాగుతూ డిప్యూటీ కలెక్టరుగా పదోన్నతి పొందారు. పాపన్న గుప్త పసితనంలోనే తండ్రి కృష్ణయ్య మరణించారు. పసివాడైన పాపన్న పెదతల్లిగారింటికి చేరి వారి ఇంట పెరుగుతూ విద్యాభ్యాసం ప్రారంభించారు. ప్రాథమిక విద్య నభ్యసించే దశలో మంచి గుర్తింపు పొందారు. 12 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు అనిబిసెంట్ గారి ఉపన్యాసాలు విని ప్రభావితులై "హెూం రూల్ ఉద్యమం"లో పాల్గొన్నారు. ఆ తర్వాత మదన్ మోహన్ మాలవ్యా ప్రసంగాలకు ఆకర్షితులై "విదేశీ వస్తు బహిష్కరణ"లో పాల్గొన్నారు. 1918వ సంవత్సరం వారి జీవితంలో గొప్ప మలుపు. 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్' మద్రాసు వచ్చారు. తను చదువుతున్న పాఠశాల విద్యార్థులతో కలిసి వెళ్లి ప్రిన్సును సన్మానించే కార్యక్రమానికి నిరసన తెలిపి వచ్చారు. ఉద్యమాలు ఊపిరిగా కొనసాగిస్తూనే హైస్కూలు విద్య పూర్తి చేసి కళాశాలలో చేరారు. చురుకైన విద్యార్థిగా, హాకీ క్రీడాకారునిగా గుర్తింపు పొందారు. కళాశాల చదువు కొనసాగించటానికి కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించలేదు. చదువుకు స్వస్తి పలికి ఉద్యోగ జీవితం ప్రారంభించారు. తండ్రి కొనసాగిన రెవెన్యూ శాఖలోనే చేరారు. దానిలో కూడా నైపుణ్యాన్ని కనబరచటంతో ప్రమోషన్ పొందే అవకాశం అంది వచ్చింది. ఆర్.డి.ఓ.గా నియమితులవుతారని అభిమానులు చెప్పుకుంటున్న తరుణంలో విధి వక్రించింది. దేశాభిమానం వారిని వెన్నుతట్టి లేపింది. గాంధీజీ ప్రవచించిన ఖద్దరు ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఉద్యోగానికి ఉద్వాసన పలికారు. ఉప్పు సత్యాగ్రహం, విదేశీవస్తు బహిష్కరణ ఉద్యమాల్లో ముందుకు నడిపిస్తూ తన అనుయాయులను కూడా తన వెంట నడిపించుకునేవారు.ఈ ఉద్యమాల ఊపు తగ్గాక ప్రజాసేవ వైపు దృష్టి మళ్ళించారు. ఆ రోజుల్లో హిందూ ఆలయాలలోకి హరిజనులు, గిరిజనులు ప్రవేశించే అవకాశం ఉండేది కాదు. వారికి ఆ అవకాశం కల్పించాలన్నది గాంధీజీ ఆశయాల్లో ఒకటి. మన రాష్ట్ర నాయకులు కూడా ఆ బాటలో నడిచేవారు. అదే బాటలో పాపన్న గుప్త నడుస్తూ ఆలయాల్లోకి హరిజనులకు ప్రవేశ అవకాశం కల్పించటం కోసం ఉద్యమాలు నిర్వహించారు. స్త్రీలు చదువుకోవాలని, ఉన్నతికి ఎదగాలని ఉద్బోధించారు. బాల్యవివాహాలను ఎదిరిస్తూ వితంతు వివాహాలు జరిపించాలనే ఆశయాలను ఉధృతంగా ప్రచారం చేశారు. వీటితో పాటు బడుగు, బలహీన వర్గాలకు సహాయ సహకారాలు అందించే కార్యక్రమాలు చేపట్టారు. వారి సేవా కార్యక్రమాలకు పరిధులు లేవనటానికి ఒకే ఒక ఉదాహరణ. 1977 నవంబరులో పెను తుఫాను సంభవించి సముద్ర తీరాన్ని అతలాకుతలం చేసింది. ఆకాశవాణి ద్వారా ఈ వార్తలు విన్న పాపన్న గుప్త తన అనుచరులతో దివిసీమకు వచ్చి అప్పటి రాష్ట్ర మంత్రి మండలి వెంకట కృష్ణారావుగారి సూచనల మేరకు పలు గ్రామాలు పర్యటించి తుఫాను బాధితులకు సేవలందించారు. సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రాంతీయ భేదాలు లేవనే గుప్త, రాయలసీమను చిన్నబుచ్చే వారికి కూడా చురక లేశారు. రాయలసీమ అంటే "రాళ్ళసీమ", పంటలు పండవు అనే ప్రచారం ఆ రోజుల్లో ఉండేది. ఇది సహించలేని పాపన్న గుప్త మైసూరు, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా పర్యటించి రాయలసీమ ఔన్నత్యం వివరించే ప్రసంగాలు చేసి, రాయలసీమ రతనాల సీమ అనటానికి ఉదాహరణలు కూడా చూపించి వచ్చేవారట. సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా యువజన సంఘాలు, వ్యాయామశాలలను, గ్రంథాలయాలను కూడా ఏర్పాటు చేయడం వారి నిత్యకృత్యాల్లో భాగమే! సామాన్య ప్రజలకు బ్యాంకు సహకారాలు అందుబాటులో ఉండటం కోసం ప్రయివేటు బ్యాంకుల ఏర్పాటుకు కృషి సల్పారు. వారి కృషికి ఫలితంగా చిత్తూరు జిల్లాలో సుమారు 100 ప్రయివేటు బ్యాంకులు ఏర్పాటయ్యాయి.రచయితగా కూడా పాపన్న గుప్త గుర్తింపు పొందారు. పద్యరచన, నవలారచన, కథా రచనలలో సిద్ధహస్తుడనిపించుకున్నారు. "భానుమతి" పేరుతో సరళ గ్రాంథిక భాషలో 1928లో రాసిన నవల 1930 లో ముద్రణ జరిగింది. నలభై ప్రకరణలు గల ఈ నవల 332 పేజీలతో అచ్చయింది. దీని ఖరీదు రూపాయి అనిమిది అణాలు మాత్రమే. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగించి జైలులో ఉన్న కాలంలో ఈ నవల రాయటం జరిగిందట. కళాశాలలో చదువుతున్న రోజుల్లోనే రచనా వ్యాసంగం ప్రారంభించారు. కథానికలు ఆనాటి పత్రికల్లో అచ్చయ్యేవి. 1927లో ప్రచురితమైన "హైమావతి" కథ, 1928లో ప్రచురితమైన "సావిత్రి" కథలు మాత్రమే అందుబాటులో ఉండగా మిగిలినవి కాలగర్భంలో కలిసిపోయాయట. పద్యరచనలు కూడా వెలువరించారు. వాటిలో "ఆర్య వైశ్య ఔన్నత్య ప్రబోధములు". ఆ పద్య గ్రంథంలో 14 మంది వైశ్య ప్రముఖులను ప్రస్తుతిస్తూ రాశారు. పద్యరచనలో కూడా వీరి రచనా విధానం సరళంగా, సౌమ్యంగా ఉండటం గమనార్హం. అఖిల భారత ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా పాపన్న గుప్త పనిచేశారు. చిత్తూరు జిల్లా "భారత్ సేవక్ సమాజ్" ఛైర్మన్ గా పనిచేశారు. విజయవాడ, హైదరాబాదు ఆలిండియా రేడియో కేంద్రాలకు ప్రభుత్వం తరపున గౌరవ సలహాదారుగా కొనసాగారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభకు ఆంధ్ర ప్రాంతపు ఛైర్మన్ గా 20 ఏళ్ళు పనిచేశారు. దాదాపు నలభై ఏళ్ళు సాధారణ సభ్యునిగా సేవలందించారు. దక్షిణ భారత హిందీ మహాసభ మద్రాసు, టి. నగర్ కు ఐదేళ్ళ పాటు అధ్యక్షునిగా కొనసాగారు. ప్రాం తీయభేదం లేకుండా, భాషా విభేదాలు లేకుండా నిత్యం ప్రజా సేవకే పరిమితమైన యం.వి. పాపన్న గుప్త 1986 నవంబరు 1న స్వర్గస్తులయ్యారు.

దాసరి ఆళ్వారస్వామి

# సర్కార్ బడుల్లో సకల వసతులు సిద్ధించేనా?

డా. ముచ్చుకోట సురేష్
బాబు,అధ్యక్షులు, ప్రజా సైన్స్ వేదిక

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు, విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న రీతిలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని చేపట్టింది. ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లోనే వారిని చేర్పించి పిల్లలకు నాణ్యమైన విద్యనందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. "మీరు మీ బిడ్డను ప్రైవేట్ స్కూల్‌లో చేరిస్తే రూ.50,000 నుండి రూ. 1.5 లక్షలు. భవిష్యత్తులో మీ పిల్లల ఉన్నత చదువుల కోసం ఈ డబ్బును ఆదా చేయండి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రైవేట్ పాఠశాలలపై మోజు తగ్గించేందుకు తల్లిదండ్రుల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా మార్పు తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పాఠశాలలో 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశారు. వీటి కింద అన్ని పాఠశాలలకు కొత్త ఫీచర్లతో తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల, తెలుగు మీడియంలో విద్యతోపాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందించారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు ఒక జత బూట్లు ఉచితంగా అందజేస్తున్నారు. జూన్ 19 వరకు బడిబాట నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.అధిక ఉత్తీర్ణత సాధించిన పిల్లలను, డ్రాపౌట్‌లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు 'అమ్మ ఆదర్శ కమిటీలతో పాటు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, యువజన సంఘాలు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ బడిబాట సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణపై విస్తృత ప్రచారం చేపట్టి ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రులు. రాష్ట్రంలోని మొత్తం 26,823 పాఠశాలల్లో 20,680 అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. 17,729 పాఠశాలల్లో అవసరమైన అన్ని పనులు ఈ కమిటీలకు అప్పగించారు. ఈ వేసవిలో పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, బ్లాక్ బోర్డులు, విద్యుత్ స్విచ్ బోర్డులు, ఫ్యాన్స్, మరుగుదొడ్ల తాత్కాలిక మరమ్మతు లన్నింటినీ ప్రభుత్వం ప్రారంభించింది. సర్కారు బడుల్లో విద్యార్థులను పెంచే లక్ష్యంతో బడిబాట కార్యక్రమం చేపట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేసేందుకు సిద్ధమవుతోంది. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లో చేరేలా కార్యక్రమాలకు ప్రణాళిక చేశారు. జూన్ 12న బడులు తెరిచాక ఆరు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరపనున్నారు. తొలిమెట్టు, సామూహిక విద్యాభ్యాసం, పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన అమ్మాయిలకు ఉన్నత విద్య, కెరీర్‌పై అవగాహన కల్పిస్తారు. చదువుకు దూరమైన పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంతో పాటు సర్కారు బడుల్లో విద్యార్థులను పెంచేందుకు విద్యాశాఖ సిద్ధమవుతోంది. జూన్ 3 నుంచి జూన్ 17వ తేదీ వరకు పండగ వాతావరణం ప్రతిబింబించేలా ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. బడిబాట లక్ష్యాలు, నిర్వహణ తీరుపై విధివిధానాలు వివరిస్తూ డీఈఓలకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన ఉత్తర్వులు పంపించారు. నేడు దేశవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలు విశ్వవిద్యాలయాలలో విద్యా ప్రమాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గణితం, సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్‌లలో పదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం వరుసగా 32 శాతం, 35 శాతం, 37శాతం, 43శాతంగా నమోదయ్యాయని 'నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే' పేర్కొన్నది. 2017నాటి జాతీయ సర్వేతో పోల్చితే, 2021సర్వేలో సగటు ఫలితాలు పడిపోయాయని తెలిపింది. తమిళనాడు, తెలంగాణ, మేఘాలయ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జాతీయ సగటు కన్నా దిగువన ఫలితాలు నమోదయ్యాయి. ఈనెల 31లోగా జిల్లా కలెక్టర్లు బడిబాట సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యక్రమాలను ప్రణాళిక చేస్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలను ఈ సమావేశాలకు ఆహ్వానిస్తారు. మండల, గ్రామస్థాయి సమావేశాలు జరుగుతాయి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలు ఇంటింటికీ తిరిగి పిల్లలను, తల్లిదండ్రులను కలిసేలా ప్రణాళిక చేశారు. బాలకార్మికులు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పిస్తారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో సరిగ్గా చదువు చెప్పరని, వసతులు ఉండవు' అన్న భావనను తొలగించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు ఏ విధంగా అవగాహన కల్పించాలన్న దానిపై నిర్ణయాలు తీసుకోనున్నారు. ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ తరగతులు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు, రెండు జతల యూనిఫాం ఇస్తున్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు సిద్ధమవుతున్నారు. పాఠశాల ప్రత్యేకతలు, సాధించిన విజయాలను వివరిస్తూ కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయనున్నారు. బడులు తెరిచాక జూన్ 12 నుంచి 17 వరకు వివిధ కార్యక్రమాలకు ప్రణాళిక చేశారు. జూన్ 12న మన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడి పేరిట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలకు రంగులు వేసి పండగ వాతావణం కల్పించి బడుల్లో పెరిగిన సదుపాయాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెరిగేలా పలు కార్యక్రమాలు చేస్తారు. తొలిమెట్టు ద్వారా విద్యార్థులు నేర్చుకునే సామర్థ్యాలను ఎలా పెరిగాయో, గతంలో ఇప్పటికీ తేడాలను వివరిస్తారు. బడుల్లో ప్రవేశపెట్టిన ఇంగ్లీష్ మీడియంలో బోధన సదుపాయాలు, రెండు భాషల్లో ముద్రించిన పాఠ్యపుస్తకాలపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచుతారు. జూన్ 17 బాలికల విద్యపై ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తారు. ఇటీవల పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థిలను భవిష్యత్తు కెరీర్, ఉన్నత విద్యావకాశాలపై సలహాలు ఇస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న మహిళలతో పాటు, ఎంసెట్లో మంచి ర్యాంకులు సాధించిన అమ్మాయిలను సత్కరిస్తారు. బాలికలకు ఉపకార వేతనాలు, కరాటే వంటి ఆత్మరక్షణ శిక్షణలు, రుతుస్రావానికి సంబంధించిన విషయాలపై చర్చిస్తారు. పాఠశాల కమిటీలు, తల్లితండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పౌర ప్రజా సంఘాలు మెరుగైన పౌర సమాజమే ధ్యేయంగా కలిసి పని చేస్తే ఉత్తమ ఫలితాలు సిద్ధిస్తాయి.

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి జలగం అవిశ్రాంత కృషి



జలగం వెంగళరావు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కు 6 వ ముఖ్యమంత్రి, నక్సలైట్లను ఉక్కుపాదంతో అణచి వేసిన ముఖ్యమంత్రిగా ఆయన దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిపదవులు నిర్వహించాడు. జలగం వెంగళరావు 1922, మే 4న శ్రీకాకుళం జిల్లా రాజాంలో జన్మించాడు. 20వ ఏట ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం వచ్చి స్థిరపడి, నైజాం వ్యతిరేక పోరాటాన్ని ఆ ప్రాంతం నుంచే ప్రారంభించిన వెంగళరావు.. జెడ్పీ ఛైర్మన్‌గా, రాష్ట్ర హెూం మంత్రిగా, ముఖ్యమంత్రిగా, పీ సీ సీ అధ్యక్షునిగా, కేంద్ర మంత్రిగా విధులు నిర్వర్తించారు.తన 20 వ ఏట నిజాముకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు. తెలంగాణ ప్రాంతంలో అమలవుతున్న కౌలుదారీ చట్టాలను నిరసిస్తూ చేపట్టిన ఈ ప్రచారంలో పాల్గొని రెండు సార్లు జైలుకు వెళ్ళాడు.1952 లో శాసనసభకు స్వతంత్రుడిగా పోటీ చేసి ఓడిపోయాడు. 1952 నుండి 1962 వరకు ఆయన కాంగ్రెసు పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఉన్నాడు.1962లో కాంగ్రెసు పార్టీ అభ్యర్థిగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం నుండి గెలిచి, 1978 వరకు మరో మూడు సార్లు సత్తుపల్లి నియోజకవర్గానికి శాసనసభలో ప్రాతినిధ్యం వహించాడు. 1967లో పంచాయితీరాజ్ ఛాంబరు చైర్మనుగా ఎన్నికయ్యాడు.కాసు బ్రహ్మానంద రెడ్డి మంత్రివర్గంలో 1969 నుండి 1971 వరకు హెూంమంత్రిగా, పి.వి.నరసింహారావు మంత్రివర్గంలో 1972–73 లో పరిశ్రమల మంత్రిగా పనిచేసాడు.జై ఆంధ్ర ఉద్యమ ఫలితంగా రాష్ట్రంలో విధించిన రాష్ట్రపతి పాలన ఎత్తివేసిన తరువాత వెంగళరావు ముఖ్యమంత్రి పదవికి ఎంపికయ్యాడు.10 డిసెంబర్ 1973 నుండి 6 మార్చి 1978 వరకు ఆంధ్రప్రదేశ్ 5వ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ ప్రాంతంలో కాకతీయ విశ్వవిద్యాలయం, కోస్తా ఆంధ్ర ప్రాంతంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, రాయలసీమ ప్రాంతంలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనే మూడు విశ్వవిద్యాలయాలు ప్రారంభించ బడ్డాయి. 1975లో హైదరాబాద్ నగరంలో ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారం భించాడు. ఆయన పాలనా కాలంలోనే ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ (ఆత్యయిక పరిస్థితి) ని విధించింది. ముఖ్యమంత్రిగా వెంగళరావు మంచి పరిపాలకుడిగా పేరుతెచ్చు కున్నాడు. నక్సలైటు ఉద్యమాన్ని కఠినంగా అణచి వేసాడు. ఎన్‌కౌంటర్ల వ్యాప్తికి కారకుడిగా విమర్శలు తెచ్చుకున్నాడు. తెలుగు సినిమా పరిశ్రమ హైదరాబాదులో నిలదొక్కుకొనేందుకు చేయూత నిచ్చాడు. మొదటి ప్రపంచ తెలుగు మహాసభలను విజయవం తంగా నిర్వహిం చాడు. అప్పటికి కొన్ని సంవత్సరాల ముందే ముగిసిన ప్రత్యేక తెలంగాణా ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమాల నేపథ్యంలో ఈ సభలు ప్రాధాన్యత సంతరించు కున్నాయి. 1975 సంవత్సరాన్ని తెలుగు సాంస్కృతిక సంవ త్సరంగా ప్రక టించి పలు కార్యకలాపాలు చేపట్టారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువను ఏన్నో వ్యయప్రయాసలకు ఓర్చి అభివృద్ధికి కృషి చేశాడు.కాంగ్రెసు పార్టీ చీలిపోయి కాంగ్రెసు (ఐ) ఏర్పడినపుడు, వెంగళరావు కొన్నాళ్ళు పార్టీకి దూరమయి,. మళ్ళీ 1984 లో కాంగ్రెసుకు తిరిగి వచ్చి, 1984, 1991 మధ్య ఖమ్మం నియో జకవర్గం నుండి లోక్‌సభకు రెండుసార్లు ప్రాతినిధ్యం వహిం చాడు. 1986 నుండి 1989 వరకు కేంద్ర పరిశ్రమల మంత్రి గా పనిచేసాడు.మంజీరాపై సింగూరు ప్రాజెక్ట్, పోచంపాడు ప్రాజెక్టు, కరీంనగర్ దిగువ మానేరు బ్యాలెన్స్ రిజర్వాయర్, శ్రీశైలం హైడల్ పాజెక్ట్ , రామగుండం సూపర్ థర్మల్ స్టేషన్, పాల్వంచ విజయవాడ దిగువ సిలేరులలో విద్యుత్ కేంద్రాలు, ప్రతీ గ్రామంలో ప్రాథమిక పాటశాలలు, ఎన్నో కళాశాలలు నెల కొల్పడం లాంటి ఎన్నో చిర కాలం గుర్తుంది పోయే కార్యక్ర మాలు చేశాడు.1999 జూన్ 12 న హైదరాబాదులో వెంగళరావు మరణించాడు. ఆయన ఇద్దరు కుమారులు... జల గం ప్రసాదరావు, జలగం వెంకటరావు రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల

# మత్స్యకారులకు సముచిత స్థానం కల్పించాలి

## – సైకం రాజశేఖర్



**కోదూరు జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** మంత్రి వర్గంలో మత్స్యకారులకు సముచిత స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార జేఏసీ చైర్మన్ సైకం రాజశేఖర్ అన్నారు. అవని గడ్డలోని మత్స్యకార భవనంలో మంగళవారం మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ, అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన ముగ్గురిలో రాష్ట్ర మంత్రివర్గంలోకి ఇద్దరిని తీసుకోవాలన్నారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న సందర్భంగా రాష్ట్ర మత్స్యకార జేఏసీ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు దేశ చరిత్రలో కని విని యేరుగని రీతిలో ఒక చారిత్రాత్మక తీర్పును ఇచ్చి, కూటమిని అధికార పీఠాన్ని అధిరోహించే అవకాశం కల్పించారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నియంతలు. పార్టీలు ప్రజలకు జవాబుదారీగా ఉండి నాణ్యమైన పరిపాలన అందించాలన్నారు. లేనిపక్షంలో ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా అప్రజాస్వామిక, నియంత, రాచరిక పాలనను రద్దు చేయగలరని ఈ ఎన్నిక రుజువు చేసిందన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు పరిపాలనలో, బడ్జెట్ కేటాయింపుల్లో, సమస్త జీవన రంగాల్లో జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు జరిపి, సామాజిక న్యాయ సూత్రాన్ని పాటించవలసిన ప్రభుత్వాలు ప్రజలకు మొండి చెయ్యి చూపిస్తున్నాయని విమర్శించారు. నూతనంగా ఏర్పాడబోయే ప్రభుత్వం ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు సమర్ధవంతమైన, వివక్ష లేని, నాణ్యమైన పరిపాలన అందించగలరని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. బిసి కులాలలో అత్యధిక జనాభా కలిగిన మత్స్యకార కులాలు, కూటమి పొత్తులలో భాగంగా తెలుగుదేశం పార్టీ తరపున మచిలీపట్నం, కాకినాడ సీట్లు కేటాయించగా, జనసేన పార్టీ నరసాపురం సీటు కేటాయించింది. ఆయా అభ్యర్థులు మూడు స్థానాల్లో సుమారు 50 వేల అత్యధిక మెజారిటీతో గెలుపొందారని గుర్తు చేశారు. మాజీ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర అక్రమ అరెస్టులతో జైలు పాలు చేసి పైశాచిక ఆనందాన్ని పొందిన పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అరెస్టును సైతం లెక్కచేయకుండా కొల్లు రవీంద్ర బిసి సాధికార కమిటీలు వేస్తూ తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయి వరకు బలపరచారు.

అదేవిధంగా పవన్ కళ్యాణ్ మత్స్యకారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి "మత్స్య కార వికాస్" విభాగాన్ని ఏర్పాటుచేసి, ఆ విభాగానికి నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ను చైర్మన్ గా నియమించారన్నారు. జనసేన పార్టీ అనుబంధ విభాగాలలో మంచి గుర్తింపు పొందిన విభాగం మత్స్యకార వికాస్ అని అన్నారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి, జీవో ఆర్టీ నంబర్ 217 ను రద్దు చేయాలని నాయకర్ పాదయాత్ర చేపట్టి మత్స్యకార ఓట్లను జనసేన వైపు మలచడంలో కీలకపాత్ర వహించారని కొనియాడారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి ఎదురు నిలబడి అత్యధిక మెజార్టీతో గెలుపొందారన్నారు. చంద్రశేఖర్ రెడ్డి ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యతలు తీసుకోవడంతో పాటు పవన్ కళ్యాణ్ న్ని ఓడించే బాధ్యత తీసుకుని విచ్చిన్న కుల రాజకీయాలకు తెర లేపాడని దుయ్యబట్టారు. విజయం సాధించిన మత్స్యకార ఎమ్మెల్యేలు వారి శక్తికి మించి, ప్రజల భాగస్వామ్యం, ఆయా పార్టీల అండదండలతో పోరాడి ఎన్నికలలో గెలిచారు. ఈ విషయాలు పరిగణలోనికి తీసుకుని మంత్రివర్గంలోకి ఇద్దరికి ప్రాతినిధ్యం కల్పించాలని ఈ సందర్భంగా ఏపీ ఫిషర్ మెన్ జేఏసీ తరపున కోరుతున్నట్లు రాజశేఖర్ తెలిపారు. అగ్నికుల క్షత్రియ రాష్ట్ర నాయకులు ఒడుగు శ్రీకాంత్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార జేఏసీ నాయకులు కోలా బాలాజీ, సైకం శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ నాంచారయ్య, అంద్రాజు శ్రీనివాసరావు, నాగిడి శంకర్, నాగిడి గోవిందు, కోలా వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ లక్ష్మణబాబు, నాగిడి అమలేశ్వరరావు, చాపల రామకృష్ణ, నడకుడిటి దావేదు, కొప్పనాతి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..

# పేదల పక్షపాతి కేశినేని శివనాథ్ చిన్ని



**విజయవాడ, జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** విజయవాడ పార్లమెంట్ చరిత్రలోనే అత్యధిక మెజార్టీ సాధించిన యువకుడు, ఉత్సాహవంతుడు, డైనమిక్ లీడర్, దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజల పక్షపాతి మన విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ చిన్ని గారిని అభినందిస్తున్న గత మూడున్నర సంవత్స రాల నుండి అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్న ఇన్చార్జి కోనేరు కిషోర్ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్సీ సెల్. "దళిత రత్న" పరిశపోగు రాజేష్. విజయవాడ పార్లమెంట్ సభ్యుని కార్యాలయం అయినా ఎన్టీఆర్ భవన్ లో కలసి అభినందించడం జరిగినది.

## కేంద్ర ప్రభుత్వమే ప్రాజెక్టుల

# నిర్మాణ బాధ్యతలను చేపట్టాలి

### – ఆర్ పి ఐ జాతీయ కార్యదర్శి పేరు శివ నాగేశ్వరరావు



**విజయవాడ, జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** రాష్ట్రంలో ప్రత్యేక నిధుల ద్వారా పోలవరం తో పాటు ఇతర సాగు, త్రాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తి చేసే బాధ్యతలను చేపట్టాలని పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు కోరారు మంగళవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా బ్యారేజీ నుండి లక్షల క్యూసెక్కుల నీరు సముద్ర గర్భంలో ప్రతి ఏటా కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నది పరివాహ ప్రాంతాలైన జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, నూజివీడు, విజయవాడ ప్రాంతాల్లో తీవ్ర నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా కృష్ణా నదికి ఒకవైపు రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో అక్కడ అవసరాలు దృష్ట్యా నీటి అవసరత చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో నీరు వృధా కాకుండా ఉండేందుకు యుద్ధ ప్రాతిపదికన చెక్ డ్యాములు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు విడుదల చేసి రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి సహకరించడంతోపాటు ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు ఫణీంద్ర కుమార్ సత్య వరప్రకాష్, వెంకటకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు,

# తక్షణమే రాజీనామా చెయ్యాలి

**విజయవాడ, జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** గత ప్రభుత్వ హయంలో, అంబటి రాంబాబు ద్వారా పదవులు పొందిన వారు తక్షణమే రాజీనామా చెయ్యాలి బత్తుల ఆదినారాయణ, సీనియర్ న్యాయవాది మరియు పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులులినామినేటెడ్ పదవులు పొందినవారు, న్యాయస్థానాల్లో ఉన్న పదవులుతో సహా వారే స్వచ్ఛందంగా రాజీనామా చెయ్యాలి. మంగళవారం రోజు ప్రెస్ నోట్‌ను బత్తుల ఆదినారాయణ విడుదల చేశారు. ఈ సందర్భంగా బత్తుల ఆదినారాయణ మాట్లాడుతూ గత వై.సి.పి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు మరియు న్యాయస్థానాల్లో సహా వాటిని వారే స్వచ్ఛందంగా రాజీనామా చెయ్యాలి అని అన్నారు. అవి కేవలం పార్టీ సిఫార్సు ద్వారా వచ్చిన పదవులు కాబట్టి వాటికి వారే రాజీనామా చెయ్యాలి అని అన్నారు. అంతేకాకుండా ఈ విషయమై గౌరవనీయ సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ గారికి మరియు తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అద్యక్షులు వారికి వారికి వ్రాత పూర్వకంగా తెలియచేయనున్నట్లు బత్తుల ఆదినారాయణ ఈ ప్రెస్ నోట్ ద్వారా తెలియజేశారు.

## గ్రాఫైట్ రిఫ్రిజిరేటర్స్‌ను

# పరిచయం చేస్తున్న హాయర్ ఇండియా




**విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** భారతదేశంలో గృహోపకరణాలు అనగానే ప్రతీ ఒక్కరికి గుర్తుకు వచ్చే పేరు హాయర్ ఇండియా. ఇప్పటికే ఎన్నో అద్భుతమైన ఉత్పత్తుల్ని భారతదేశానికి అందించిన హాయర్ ఇండియా.. వరుసగా 15 ఏళ్లపాటు... నెంబర్ వన్ గ్లోబల్ మేజర్ అప్లయెన్సెస్ బ్రాండ్ గా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు తాజాగా ప్రస్తుత సీజన్ కు ఎంతగానో ఉపయోగపడే విధంగా... గ్రాఫైట్ సిరీస్‌ను ఆవిష్కరించింది. ఇది ఆధునిక భారతీయ గృహాల సౌందర్యాన్ని మరో స్థాయికి తీసుకువెళ్లే... అద్భుతమైన మ్యాట్టే ఫినిషింగ్ తో వస్తుంది. అన్నింటికి మించి ఇవి సమకాలీన డిజైన్‌తో ప్రీమియం రేంజ్ స్టీల్ డోర్ రిఫ్రిజిరేటర్ లు. ఈ సిరీస్ 205 లీటర్ల నుంచి 602 లీటర్ల వరకు సామర్థ్యంలో అందుబాటులో ఉంటుంది. ప్రీమియం క్వాలిటీపై దృష్టి సారించి ఉత్పత్తుల్ని రూపొందిస్తుంది హాయర్ ఇండియా. ఇప్పుడు తాజాగా ఆవిష్కరించిన సరికొత్త రేంజ్ రిఫ్రిజిరేటర్‌లు సొగసైన మ్యాట్టే ఫినిషింగ్ డిజైన్‌ను కలిగి ఉంటాయి. అన్నింటికి మించి ఆధునిక భారతీయ గృహాలలో అద్భుతంగా మిళితం అవుతాయి. మరోవైపు వంటగదిని సొగసైనవిగా మార్చేస్తాయి. డైరెక్ట్ కూల్, టాప్-మౌంటెడ్, బాటమ్-మౌంటెడ్, 2-డోర్ సైడ్-బై-సైడ్ మరియు 3-డోర్ సైడ్-సైడ్ వంటి అనేక రకాల కాన్ఫిగరేషన్‌లలో ఈ సిరీస్ అందుబాటులో ఉన్నాయి. హాయర్ తన విప్లవాత్మకమైన 3-డోర్ వై-ఫై కన్వర్టిబుల్ సైడ్ బై సైడ్ రిఫ్రిజిరేటర్స్ రేంజ్ లో మ్యాట్టే ఫినిషింగ్ సిరీస్‌ను కూడా పరిచయం చేసింది. హాయ్-స్మార్ట్ యాప్‌ని ఉపయోగించి ఎక్కడి నుండైనా ఫ్రీజర్ విభాగాన్ని ఫ్రిజ్‌గా మార్చడానికి వినియోగదారులకు అవకాశం కల్పిస్తోంది. ఈ సందర్భంగా హాయర్ అప్లయన్సెస్ ఇండియా అధ్యక్షులు ఎన్.ఎస్. సతీష్ మాట్లాడుతూ... "హాయర్ లో మేము... రోజువారీ జీవితాలను సుసంపన్నం చేసే కస్టమర్-ప్రేరేపిత వినూత్న పరిష్కారాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మా వ్యూహాత్మక దృష్టి సమగ్ర పరిశోధన, అత్యాధునిక సాంకేతికతలు మరియు అత్యంత సమర్థవంతమైన తయారీ ప్రక్రియల పైనే ఉంటుంది. దీనిద్వారా వివిధ వర్గాలలో అత్యుత్తమ-తరగతి ఉత్పత్తులను పరిచయం చేయడం చుట్టూ తిరుగుతుంది. రెండు దశాబ్దాలకు పైగా భారతీయ మార్కెట్లో బలమైన ఉనికిని ఏర్పరుచుకున్న మేము... ఇప్పుడు తాజాగా ప్రారంభించినన గ్రాఫైట్ సిరీస్ ద్వారా ప్రీమియం మార్కెట్ లో మా ముద్రను వేయాలనుకుంటున్నాం అని చెప్పారు.

# శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

**నూజివీడు జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** ఏఐటియుసి టౌన్: ఏఐటియుసి శిక్ష ణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్య దర్శి ఎస్ వెంకటసుబ్బయ్య పిలుపుని చ్చారు. పట్టణములోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏఐటి యుసి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రెండు రోజు లు నూజివీడులో జరగబోయే శిక్షణ తరగతులలో సంఘటిత, అసంఘటిత కార్మికుల ఎదుర్కొనే ప్రధానమైన సమస్యలు చర్చించడం జరుగుతుందన్నారు. ఇప్పుడు వస్తున్న కార్మిక విధానాలకు, కార్మికుల సమస్యలు, సంఘాల ఏర్పాటు తదితర నిర్మాణపరమైన విషయాలను తరగతులు చర్చిస్తామన్నారు. నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కారం, స్కీం వర్కర్ల జీతాల పెంపు, వంటి సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, నూజివీడు ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం శ్రీను, సహాయ కార్యదర్శి కే రామ్మూర్తి, హెచ్.పీ గ్యాస్ యూనియన్ నాయకులు వేణుగోపాలరావు, శ్రీను, వెంకటేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## కుషాక్ ఆనిక్స్‌ని ఆటో ట్రాన్స్ మిషన్‌తో

# సిద్ధం చేసిన స్కోడా ఆటో ఇండియా



**విశాఖపట్నం జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** భారతదేశంలో ప్రీమియం కార్ల సెగ్మెంట్ లో అగ్రగామిగా ఉన్న స్కోడా కార్లు. అద్భుతమైన ప్రీమియం ఫీచర్లతో భారతీయులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబా చెప్పారు. స్కోడా కూడా అద్భుతమైన ఫీచర్లు కలిగిన కార్లని అందిస్తుందన్నారు. మరోవైపు స్కోడా ఆటో ఇండియా తమ నిరంతర వ్యూహాల్లో భాగంగా, 5 స్టార్ సేఫ్ ఫ్లీట్‌లో మరో అప్ డేట్ ను అందించిందన్నారు. అదే కుషాక్ ఆనిక్స్ ఏటీ అని, స్కోడా అభిమానులు వినియోగాదరులకు అధిక విలువను అందించే లక్ష్యంతో ఆనిక్స్ ను అందిస్తుందన్నారు. నిజానికి వినియోగదారుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఈ కారుని 2023 మొదటి త్రైమాసికరంలో విడుదల చేశారని, ఇప్పుడు స్కోడా ఆటో ఇండియా, తాజాగా వినియోగాదురుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా, ఇప్పుడు కుషాక్ ఆనిక్స్ లో ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ ను ప్రవేశపెట్టిందన్నారు. సరికొత్త ఫీచర్లతో మరింత మెరుగుపరిచిందని, ఈ సెగ్మెంట్ లో అత్యంత సరసమైన ఆటోమేటిక్ కారు ఇదన్నారు. "ఆనిక్స్ వేరియంట్ మా లైనప్‌లో అద్భుతమైన కారు అని, అధిక వేరియంట్‌ల ఫీచర్లతో కలిపి ఒక కీలకమైన జోడింపుగా ఉందన్నారు. ఈ కొత్త కుషాక్ ఆనిక్స్ మా కస్టమర్‌ల నుండి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌కు అనుగుణంగా రూపొందించామన్నారు.

## సరికొత్త జాతీయ మార్కెటింగ్ ప్రచారాన్ని ప్రారంభించిన

# క్షేమ జనరల్ ఇన్సూరెన్స్

kshema

**విజయవాడ, జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** ఖరీఫ్ సీజన్ ప్రారంభం సందర్భంగా పంటల బీమాపై అవగాహన పెంచే లక్ష్యంతో క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తమ జాతీయ మార్కెటింగ్ ప్రచారాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ సమగ్ర ప్రచారంలో ప్రధాన అంశం టీవీ ప్రచారం. ఇది రుతుపవనాల ప్రారంభంతో రైతులు విత్తడం ప్రారంభించిన వేళ వారికి చేరుతుంది. ప్రింట్, డిజిటల్, అవుట్‌డోర్ మీడియాలో ఏకకాలంలో చేసే ప్రచారం ద్వారా ఈ టీవీ ప్రచారం మరింతగా రైతులకు చేరుతుంది. విపరీతమైన వాతావరణ సంఘటనలు తరచుగా ఎదురుకావడంతో పాటుగా అవి తీవ్రమవుతున్న వేళ రైతులకు ఆర్థిక భద్రతా వలయాన్ని రూపొందించడంలో పంట బీమా యొక్క ప్రాముఖ్యతను ఈ ప్రచారం వెల్లడిస్తుంది.

## నేటి ప్రధాని పర్యటనకు

# కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

### ఎస్పీజి నవనీత్ కుమార్ మెహతా



**గన్నవరం: జూన్ 11, (ఆంధ్రపత్రిక) ;** నేడు బుధవారం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గన్నవరం పర్యటన నేపథ్యంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఎస్పీజి ఐ జి నవనీత్ కుమార్ మెహతా అధికారులకు సూచించారు. ఈ నెల 12వ తేదిన గన్నవరం మండలం, కేసరపల్లి గ్రామంలోని ఐటీ పార్కు మేధా టవర్స్ సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయునున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన ఏర్పాట్లపై మంగళవారం ఉదయం గన్నవరం విమానాశ్రయంలో ముందస్తు భద్రత సమన్వయం (ఏ ఎస్ ఎల్) నిర్వహించారు. కార్యక్రమం ప్రత్యేక అధికారులు హరి కిరణ్, డిఐజి గోపీనాథ్ జెట్టి, జిల్లా పోలీస్ అధికారి అద్నాన్ నయీమ్ అస్మి ఇతర పోలీసు అధికారులతో కలిసి ఆయన ప్రధానమంత్రి కాన్వాయ్ రాక పోకలపై రూట్ మ్యాప్ ను చర్చించారు. ఆ మార్గంలో గన్నవరం విమానాశ్రయం నుండి ప్రమాణ స్వీకార వేదిక వరకు ట్రయల్ రన్ కాన్వాయన్ ను నడిపించారు. ప్రధానమంత్రి రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ ఏ ఎస్ ఎల్ లో అదనపు ఎస్పి జి వెంకటేశ్వరరావు, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, డి ఎం హెచ్ ఓ డాక్టర్ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి మళ్లీ అన్యాయం



**విజయవాడ, జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** విజయవాడ గాంధీనగర్‌లోని కార్యాలయంలో ఏపీసీసీ ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ గారు తేదీ: 11-06-2024, మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలో ఎన్డీఏ సర్కారు ఏర్పడటంలో ఐదుకోట్ల ఆంధ్రులు కీలక పాత్ర పోషించారు. టీడీపీ-జనసేనను నమ్మి గత పదేళ్లు గా ఏపీకి ఎన్నో విధాలుగా అన్యాయం చేసిన బీజేపీని సైతం ఆదరించారు. అయినా ప్రధాని మోదీ ఏపీ పట్ల తన వైఖరిని మార్చుకున్న దాఖలాలు లేవు. కేంద్రంలో టీడీపీకి చెందిన ఇద్దరు మంత్రులకు కేటాయించిన శాఖలే ఇందుకు నిదర్శనం. శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహననా యుడుకు కేబినెట్ హోదా ఇచ్చినప్పటికీ పౌర విమానయాన శాఖతో సరిపుచ్చారు. ఇక గుంటూరు నుంచి ఎన్నికైన పెమ్మసానికి సహాయ హోదా గ్రామీణాభివృద్ధి కమ్యూ నికేషన్ల కేటీయించి చేతులు దులుపుకున్నారు. ఈ శాఖల వల్ల ఏపీకి ఒరిగేదేమీ లేదు. నరసాపురం నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మకు మాత్రం సహాయ హోదాలో ఉక్కు, పరిశ్రమలశాఖను కట్టబెట్టారు. కూటమి ఏర్పడటానికి కారణమైన జనసేనకు కనీసం సహాయమంత్రి పదవి కూడా ఇవ్వలేదు. ఇదంతా చూస్తుంటే మోదీ మూడో సారి ప్రధాని కావడానికి ఏపీ సమస్యలపై ఎటువంటి హామీ ఇవ్వకుండానేచంద్రబాబును, పవన్ కల్యాణ్ ను రాజకీయంగా ఉపయోగించుకున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు గారి ప్రమాణ స్వీకారానికి హాజరవుతున్న ప్రధాని నరేంద్రమోదీ ఇప్పటికైనా... ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించడంతో పాటు పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి నిర్మాణం, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు, ఉక్కు కర్మాగార నిర్మాణం తదితర విభజన చట్టంలో పేర్కొన్న హామీల అమలు పై నిర్దిష్ట కాలవ్యవధితో కూడిన స్పష్టమైన హామీ ఇవ్వాలి. విభజనతో అన్నివిధాలుగా చితికిపోయిన ఏపీ ప్రయోజనాల కోసం కేంద్రంలోని మోదీ సర్కారుపై పోరాడేందుకు ఇదే మంచి సమయమని ఐదు కోట్ల మంది ఆంధ్రులు భావిస్తున్నారన్న సంగతిని చంద్రబాబు గుర్తెరగాలి. ఏకపక్ష ధోరణులు పక్కనబెట్టి శాసనసభలో ప్రాతినిధ్యం ఉన్నా లేకపోయినా ప్రతిపక్ష పార్టీలతో కలిసి రాష్ట్ర హక్కుల కోసం ఉద్యమించాల్సిన సమయం ఇదని గ్రహించాలి. అవసరమైతే రాష్ట్రం కోసం ఎన్డీఏ కూటమి నుంచి వైదొలగాలి. ఏపీ సమస్యలన్నింటి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇస్తున్న కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు తెలపాలి. తాను ప్రధానమంత్రినయితే తొలి సంతకం ఏపీ ప్రత్యేక హోదా ఫైలుపైనే చేస్తానన్న రాహుల్ గాంధీ హామీ ఈ సందర్భంగా శివాజీ గుర్తు చేశారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన పిడి పార్థసారథి



**హిందూపురం, జూన్ 11 (ఆంధ్రపత్రిక) ;** భారత ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్.డి. ఏ కూటమి 3వ సారి ఎన్నికలలో విజయం సాధించిన శుభసందర్భం లో రాష్ట్రపతి భవన్‌లో వారి ప్రమాణ స్వీకర కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, దయాకర్ రెడ్డి,సురెంద్ర మోహన్, పిడి పార్థసారధిలు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా కేంద్ర కాబినెట్ మంత్రి జి. కిషన్ రెడ్డిని, కేంద్ర సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్ ను, భూపతి రాజును, శ్రీనివాస వర్మను, మురుగన్ ను ఢిల్లీలోని వారి కాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# గొల్లపల్లి హైస్కూల్లో విద్యార్థులను చేర్పించండి

**నూజివీడు జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** కొత్తపల్లి గ్రామంలో క్యాంప్ పైన్ నిర్వహించుచున్న ఉపాధ్యాయులు అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని రాధికా రాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు ఈ విద్యా సంవత్సరములో నూతనంగా పాఠశాలకు విద్యార్థినీ విద్యార్థులను చేర్పించుటకు క్యాంప్ పైన్ నిర్వహించడం జరుగుచున్నది. ఉదయం మరియు రాత్రి సమయంలో విద్యార్థినీ విద్యార్థులు తల్లితండ్రులను కలసి గొల్లపల్లిస్కూల్ యొక్క ప్రాధాన్యతగూర్చి వివరించడంజరుగుచున్నది. 10వ తరగతిలో మంచి పర్సండేజ్ సాధించడం జరిగినది అని 570 మార్కులు సాధించడం, చక్కని ల్యాబ్ సౌకర్యం, లైబ్రరీ, మినరల్ వాటర్, ప్రభుత్వం వారిచే ఉచిత పుస్తకాలు, అత్యుత్తమ భోదన ,విశాల ఆట స్థలం, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దడం జరుగును అని వివరించారు. లెక్కల్ సబ్జెక్టులో 100కి 100 మార్కులు సాధించడం జరిగినది అని తల్లిదండ్రులకు వివరించి స్కూల్ లో చేర్పించవలసినదిగా తెలపటం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, విఠల్ బాబు, మోహన్ రావు, రంగారావు, లైబ్రేరియన్ నారాయణ కొత్తపల్లి గ్రామంలో మరియు పోలసానపల్లి ,గొల్లపల్లి, మొర్సపూడిలో క్యాంప్ పెన్ నిర్వహించి, తల్లిదండ్రులకు వివరించి మీ పిల్లలను శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో చేర్పించవలసినదిగా కోరటమైనది.

## మల్లంపూడి అంగన్వాడి సెంటర్ నందు

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**బంటుమిల్లి 11 జూన్ (ఆంధ్రపత్రిక) :** బంటుమిల్లి మండలం మల్లంపూడి సచివాలయ పరిధిలోని మల్లంపూడి 1 అంగన్వాడీ కేంద్రంలో, మల్లంపూడి మరియు నాగన్న చెరువు అంగన్వాడి కేంద్రాలు కలసి ఐదు సంవత్సరాలు పూర్తి అయిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ వై షర్మిల, ఏఎన్ఎం ఎల్ సంతోషమ్మ, ఆశా వర్కర్ మరియు అంగన్వాడీ టీచర్స్ ఏ నాగదుర్గ, కె శ్రీదేవి జె ఉషారాణి, జే ఏ ఎస్ వాణి, ఎన్ కృష్ణకుమారి, మరియు పిల్లలు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## యాదమరి బ్రహ్మోత్సవాల్లో
# వైభవోపేతంగా వరదుడి గరుడసేవ

**ఆకాశంలో చక్కర్లు కొట్టిన గరుత్మంతుడు..పరవశించిన భక్తజనం..**





**యాదమరి,జూన్11 (ఆంధ్రపత్రిక):** మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో స్వయాంభూగ వెలసిన పెరిగిందేవి సమేత శ్రీ వరదరాజస్వామి ఇంద్ర వరదుని బ్రహ్మోత్సవాలు వైభవంగా అత్యం త మనోహరంగా జరుగుతున్నాయి. మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత ఇంద్ర వరదునికి ప్రత్యేకంగా మూలవర్లుకు పుష్ప కైంకర్యం అభిషేకం లేట్ గోవింద స్వామి కుటుంబ సభ్యుల ఆధ్వరంలో ఘనంగా నిర్వహించారు.ఉదయం బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవకు ప్రత్యేకంగా ఒక విశిష్టత ఉంది ముఖ్యంగా రాజ గోపుర దర్శనం అనంతరం ఆకాశంలో గరుత్మంతుడు ప్రత్యక్షమై కనిపించి రాజ గోపురం మీద చక్కర్లు కొట్టి వరదుని సేవలో తరించగా భక్తులు భక్తి పారవశ్యంలో తన్మయత్వం చెంది ఆసాంతం గోవింద నామ స్మరణతో ఆలయం మారుమ్రోగింది. మంగళవారం ఉదయం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయక శ్రీదేవి పెరిందేవి సమేత ఇంద్ర వరదరాజులు పక్షి రాజు అయిన గరుడ వాహనంపై సాక్షాత్తు విష్ణుమూర్తి రూపంలో వరదుడు మాడా వీధుల్లో దర్శినమిచ్చి గరుడ వాహనం పై పరంధాముడు విహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మంగళ కర్పూర హరతులు సమర్పించి స్వామివారి సేవలో తరించారు. గరుడ సేవకు చిత్తూరు నగరానికి చెందిన పూల భాస్కర్ నాయుడు కుటుంబ సభ్యులు ఉబయదారులుగా వ్యవహరించారు. రాత్రి కల్పవృక్ష వాహనంలో స్వామివారు దర్శనమిచ్చారు ఉబయం చిత్తూరు నగరం కృష్ణయ్య శెట్టి కుటుంబ సభ్యులు. బ్రహ్మోత్స వాలలో బుధవారం, హనుమంత వాహనం,నాచ్చియార్ తిరుక్కోలం, సాయంకాలం స్వామి వారికి కల్యాణోత్సవం, రాత్రికి ఏనుగు వాహనంలో స్వామి ఊరేగనున్నరు.

## వారం రోజులు సెలవుపై
# టిటిడి ఇఓ ధర్మారెడ్డి

**రాష్ట్రం దాటి వెళ్లకూడదని షరతు**



**తిరుమల,జూన్11 (ఆంధ్రప్రత్రిక):** తిరుమల తిరుపతి దేవస్థానం ఇఒ ధర్మారెడ్డి వారం రోజులు సెలవుపై వెళ్లారు. ఈ నెల 11 నుంచి 17 వరకు వ్యక్తిగత పనుల కోసమంటూ సెలవుకు దరఖాస్తు చేయగా, సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ సెలవును మంజూరు చేశారు. ఈ వారం రోజులు రాష్ట్రం విడిచి వెళ్లరాదని, హెడ్ క్వార్టర్స్‌లో మాత్రమే ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇఒపై జనసేన నేతలు తిరుపతిలో ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి పాఠకులకు విధితమే. నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఈ నెల 12న ప్రమాణస్వీకారోత్సవం చేసిన అనంతరం తిరుమలకు వెళ్లను న్నారు. అదేరోజు రాత్రి అక్కడే బస చేసి 13న ఉదయం వెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఇఒ సెలవు పెట్టడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధర్మారెడ్డి కొత్త ప్రభుత్వం రాగానే సెలవు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. అయితే సీఎస్ సెలవులు మంజూరు చేయలేదు. ఆయన ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు.

# ఆశా కార్మికులపై పని భారం తగ్గించాలి



**చౌడేపల్లి,జూన్11(ఆంధ్రపత్రిక) :** ఆశా కార్యకర్తలకు పని భారం తగ్గించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆశాడే సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆశా కార్మికులకు పని భారం తగ్గించాలని,కొత్త ఫోన్లు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం ఆశాలకు సమస్యలపై ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైన ఆశా కార్మికుల సమస్యలపై దృష్టి సారించి వారికి పనిపారం తగ్గించి, వేతనాలు పెంచి, కొత్త ఫోన్లు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఆశ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు .ఈ సమస్యలపై ఆశా కార్మికులందరూ ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక చౌడేపల్లి పిహెచ్ సి కమిటీ అధ్యక్షురాలు అనురాధ, కార్యదర్శి రత్నమ్మ, ఉపాధ్యక్షురాలు శాంతమ్మ, సహాయ కార్యదర్శి నాగమ్మ, కోశాధికారి లక్ష్మీదేవి, లతోపాటు పదిమంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. లద్దిగం పి ఎస్ సి కమిటీ అధ్యక్షురాలుగా లీలా, కార్యదర్శిగా సావిత్రి, ఉపాధ్యక్షులు పి హేమలత, కోశాధికారి సుబ్బమ్మలతో 7 మందిని ఎన్నుకోవడం జరిగింది.

## భక్తిసాగరంలో ముంచెత్తిన
# అయోధ్యకాండ అఖండ పారాయణం





**తిరుమల, జూన్11 (ఆంధ్రప్రత్రిక):** లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై మంగళవారం ఉదయం జరిగిన 11వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 7 నుండి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. అయోధ్యకాండలోని 40 నుండి 44వ సర్గ వరకు మొత్తం నాలుగు సర్గల్లో 159 శ్లోకాలు, యోగవాశిష్టం మరియు ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 184 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేద పాఠశాల పండితులు డా. రామానుజాచార్యులు, శ్రీ అనంత గోపాలకృష్ణ, డా. మారుతి శ్లోక పారాయణం చేశారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థకు చెందిన వేదపారాయణదారులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్ర పండితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు శ్రీనివాస్ బృందం "శ్రీరామ నీనామ మేమిరుచిరా ఓరామ నీనామ మెంతరుచిరా.... " అనే కీర్తనను కార్యక్రమ ప్రారంభంలో, "రామ రామ యనరాదా రఘుపతి, రక్షకుడని వినలేదా ......" అనే నామ సంకీర్తనను చివరిలో రసరమ్యంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, పండితులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న



**గూడూరు, జూన్11, ఆంధ్ర పత్రిక:** అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని వీరభద్ర స్వామి ఆలయ నిర్వాహ కులు ముని మోహన్ పేర్కొన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని త్యాగరాజావీధిలో కొలువై ఉన్న శ్రీ కల్యాణ వీరభద్ర స్వామి దేవాలయంలో నిర్వాహకులు మునిమోహన్ అధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా గుమ్మడి సుధాకర్ రావు, ప్రమీలమ్మ,వారి కుమారుడు గుమ్మడి శశిధర్, పూజిత వ్యవహరించారు.

# మలేరియాపై పోరాటం వేగవంతం చేయాలి



**కలిగిరి,జూన్11(ఆంధ్రపత్రిక) :** కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమర్యాలీనీ నిర్వహించారు. మరింత సమానమైన ప్రపంచం కోసం మలేరియాపై పోరాటం వేగవంతం చేయాలి అనే నినాదంతో, దోమ పుట్ట కూడదు దోమ కుట్టకూడదు అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా జ్వరంకి పూర్తిగా ప్రభుత్వ ఆసుప్రతి లోనే మందులు అందుబాటులో ఉన్నాయి అని, ప్రజలు అందరూ దోమలు కుట్టకుండా తీసుకో వలసిన జాగర్తలను గురుంచి, ప్రతి శుక్రవారం ప్రతి ఇంటిలో ఫ్రై డే డ్రై డే పాటించాలని, జ్వరం వచ్చిన వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలి అని కలిగిరి పి హెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ బీజ్జం గీతా రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమములో కలిగిరి పి హెచ్ సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంగజాతరకు సర్వం సిద్ధం..



**సోమల, జూన్ 11 ఆంధ్రప్రత్రిక:** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల లోగంగజాతర కు సర్వం సిద్ధం చేసినట్లు జాతర నిర్వాహకులు తెలిపారు. ఈ క్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆనవాయితీగా చేస్తున్న గంగజాతరను ఈ మారు కూడా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత మంగళవారం నాడు చాటు ప్రకటించారు. అనంతరం సోమల పరిసర ప్రాంతాల్లో బలిపోతు ను త్రిప్పుతూ ప్రత్యేక పూజలను గ్రామ ప్రజలు నిర్వహించారు. వారం రోజుల అనంతరం అమ్మవారిని స్థానిక శివాలయం వద్ద ప్రతిష్టంచి భక్తులకు దర్శనం కోసం కొలువు తీర్చి ప్రత్యేక అలంకరణ చేసినట్లు తెలిపారు. అలాగే భక్తులు తమ కోరికలు తిరినందుకు గ్రామ నలుదిక్కుల ఉన్న అమ్మవారికి రాత్రి అంతయు దివ్వెల ను మోసి మొక్కులు ను తీర్చుకొనేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసారని తెలిపారు. బుధవారం అమ్మవారు కొలువై భక్తులుకు దర్శనమిస్తారు.సాయంత్రం అసాది వారి పాటల తో అమ్మవారిని సంతోష పరచి జల్దీకి తీసుకొని వెళతారు.గ్రామంలో చిట్ట చివరి పండుగ కనుక జిల్లా లోని నలుమూలల నుండి భక్తులు,బంధువులు సోమలకు వచ్చి పండుగను సంతోషంగా గడుపుతారు.

# కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు

**సహకార బ్యాంకులో, రైతులు ప్రజలు, జీరో ఖాతాలను, సద్వినియోగం చేసుకోండి బ్యాంక్ చీఫ్ మేనేజర్ సరోజమ్మ**



**నందికొట్కూర్, జూన్ 11(ఆంధ్రప్రత్రిక):** ఆప్కాబ్‌కు అనుసంధానంగా నడుస్తున్న జిల్లా సహకార కేంద్రం బ్యాంకులు, కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా పనిచేసి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో ముందున్నామని ,నందికొట్కూర్ బ్రాంచ్, కె డి సి సి బ్యాంక్ చీఫ్ మేనేజర్ సరోజమ్మ అన్నారు, మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చీఫ్ మేనేజర్ సరోజమ్మ మాట్లాడుతూ, రైతుల సేవలకే పరిమితం కాకుండా సహకార బ్యాంకులో అన్ని రకాల డిపాజిట్లు, లాకర్లు, పొదుపు సంఘాలకు ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా తక్కువ వడ్డీతో రుణాలు, ప్రభుత్వం నుండి వచ్చే రాయితీ రుణా లు అందిస్తున్నామన్నారు, డిపాజిట్లపై వడ్డీ కూడా అన్ని బ్యాంకుల కంటే ఎక్కువగా ఉంటుందని, ఖాతా దారులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. బ్యాంకులో కేవైసీ ఆధార్ కార్డ్, పాన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు కేడీసీసీ బ్యాంకులో జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలను తెరు స్తున్నామని, ఈ అవకాశాన్ని నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నామినేటెడ్ పదవులన్నీ హుష్ కాకి..

**శ్రీకాళహస్తి ,జూన్ 11 (ఆంధ్రప్రత్రిక):** రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నామినేటెడ్ పదవులను రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గత ప్రభుత్వం ఇచ్చిన నామినేటెడ్ పదవులన్నీ జీవో రాకతో రద్దయిపోయాయి. ఈనెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు జరిగింది. వైసిపి ప్రభుత్వానికి మెజార్టీ రాక పోవడంతో ఆ ప్రభుత్వం హయాంలో పదవులు పొందిన వారు చాలామంది రాజీనామా చేశారు. మరికొందరు ఉదాసీనంగా ఉంటున్నారు. బుధవారం కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం జరగనుంది. కొత్త ప్రభుత్వం బాధ్యతలు తీసుకోక ముందే అధికారులు నామినేటెడ్ పదవులను రద్దు చేస్తూ ఉత్తర్వు ఇచ్చారు. దీంతో గత ప్రభుత్వం హయాంలో నామినేటెడ్ అయిన వారందరి పదవులు రద్దయి పోయినట్లే. జీవో జారీ కాకముందు పదవులు పొందిన వారు రాజీనామా చేయాలి. జీవో జారీ అయిన తర్వాత రాజీనామా చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వారి పదవులు ఆటోమేటిక్ గా రద్దవుతాయి. దేవాదాయ శాఖ ధర్మ కర్తల మండళ్లకు కూడా ఈ జీవో వర్తిస్తుంది. అయితే ఈ జీవో ఆధారంగా ధర్మకర్తల మండళ్ళు కోర్టుకు వెళితే స్టే వస్తుంది. ఎందుకంటే ధర్మకర్తల మండళ్ళలో పార్టీలకు సంబంధించిన వారున్నా కోర్టులు స్టే ఇవ్వడం ఆనవాయితీగా ఉంది. గతంలో కూడా అదేవిధంగా జరిగింది. మిగిలిన శాఖల పదవులకు మాత్రం కోర్టులు స్టే ఇచ్చిన సందర్భాలు లేవు. నామినేటెడ్ పదవుల రద్దు జీవో వచ్చిన తర్వాత అందరూ మాజీలు అయిపోయారు. అందువల్ల మళ్లీ రాజీనామాలు చేయాల్సిన అవసరం లేదు.

# ఘనంగా రమేష్ రెడ్డి జన్మదిన వేడుకలు



**చౌడేపల్లి,జూన్11(ఆంధ్రప్రత్రిక):** తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి, జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నందు ఆయన అభిమానుల సమక్షంలో వేడుకలు జరుపుకున్నారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు అందరికీ పంచిపెట్టారు. బస్టాండ్ తో పాటు గువ్వల రమేష్ రెడ్డి, సొంత నివాసం తెల్లనీళ్ల పల్లిలో అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. భారీగా బాణాసంచాలు పేర్చి అభిమానాన్ని చాటుకున్నారు. గువ్వల రమేష్ రెడ్డి యువతకు ఆదర్శప్రాయుడని పలువురు కొనియాడారు. తెలుగుదేశం పార్టీ యువనాయకుడు మాదిరాజు ప్రదీప్ రాజు, శ్రీధర్ రాజు, (గిరి) పూల చంద్రమౌళి, జంపాల శ్రీనివాసులు, బోయకొండ సుబ్బు, నాగిరెడ్డిపల్లి కుమార్రెడ్డి, మునస్వామి, అర్జున్ రాయల్, బత్తలాపురం రమేష్, జయరాం, మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం
# విజయవంతం చేయండి

**తిరుపతి జిల్లా టిడిపి సోషల్ మీడియా కన్వీనర్ కోటా చంద్రశేఖర్**



**శ్రీకాళహస్తి జూన్11 (ఆంధ్రప్రత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న నారా చంద్రబాబు నాయుడు సభను విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ నాయి బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కన్వీనర్ కోటా చంద్రశేఖర్ మంగళవారం పిలుపునిచ్చారు.అదే విధంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి ప్రమాణస్వీకారం చేస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం రాష్ట్ర నాయి బ్రాహ్మణ సాధికార సమితి, నాయి బ్రాహ్మణుల కృతజ్ఞత సమావేశం రాష్ట్ర నాయి బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులు వైద్యం.శాంతారాం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విజయవాడలోని ఎన్టీఆర్ భవన్ నందు జరుగుతున్నదని కృతజ్ఞత సమావేశానికి నాయి బ్రాహ్మణులు అందరూ వచ్చి జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# బారి బందోబస్తు నడుమ గంగజాతర..



**సోమల, జూన్ 11 (ఆంధ్రప్రత్రిక):** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల లోగంగజాతర సందర్భంగా సర్కిల్ సి.ఐ.కృష్ణారెడ్డి ,ఎస్.ఐ.నరసింహులు గ్రామస్తులతో సోమల పోలీస్ స్టేషన్లో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల ముగిసిన అనంతరం జరుగుతున్న గంగజాతర లోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు ఈసమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ జాతరకు జిల్లాలో ని నలు మూలలనుండి అధిక సంఖ్యలో బంధువులు ,భక్తులు హాజరవుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో జాతర లో అన్ని పార్టీల కు చెందిన వారు నిర్వహిస్తారని ఈ క్రమంలో ఎవ్వరు గాని కవ్వింపు చర్యలు కు పాల్పడ రాదని తెలిపారు. అలా ఎవరైనా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్పించారాదని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరు సంయమనం పాటించాలనికోరారు.జాతర ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.జాతర ముగిసేవరకు ఎవ్వరు చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు చేయరాదని తెలిపారు. అలా చేసిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## లేపాక్షి గ్రామపంచాయతీ
# వారపు సంత మరియు బస్టాండ్ వేలం ప్రకటన

**లేపాక్షి, జూన్ 11 (ఆంధ్రప్రత్రిక):** లేపాక్షి గ్రామపంచాయతీ కి చెందిన వారపు సంత మరియు బస్టాండ్ వేలం ప్రకటన 13 .6. 2024 అనగా గురువారం నాడు ఉదయం 10 గంటలకు లేపాక్షి గ్రామపంచాయతీ కార్యాలయం నందు నిర్వహించబడును. కావున బహిరంగ వేలంలో పాల్గొనే అభ్యర్థులు 2024 2025 సంవత్సరం గాను బస్టాండ్ వేలంపాటకు 2 లక్షలు, మరియు వారపు సంతకు 30 వేలు డిపాజిట్ చేయవలెను ఆ విధంగా చేసి పాల్గొనవలసిందిగా పంచాయతీ సెక్రెటరీ ప్రకాష్ రెడ్డి తెలియజేశారు.

# ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి కళ్యాణ్ భరత్ రాజీనామా



**చౌడేపల్లి,జూన్11(ఆంధ్రప్రత్రిక):** చౌడేపల్లి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పదవికి కళ్యాణ్ భరత్ రాజీనామా చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన మండల వైద్యాధికారిని పూజాకు, వాట్సఅప్ ద్వారా రాజీనామా పత్రాన్ని అందించారు. ఎన్నికల్లో వైకాపా పరాజయం పాలైన సందర్భంగా ఆయన చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ పెద్దిరెడ్డి కుటుంబంతో తన పయనం సాగుతుందని ప్రజా క్షేత్రంలో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఇన్ని రోజులు తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు
# నగరంలో 14 ఎల్.ఈ.డి. స్క్రీన్‌లు ఏర్పాటు



**గుంటూరు : జూన్ 11( ఆంధ్రపత్రిక ):** బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకార కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రజలు తిలకించేందుకు గుంటూరు నగరంలో 14 ప్రాంతాల్లో ఎల్.ఈ.డి. స్క్రీన్ లు ఏర్పాటు చేశామని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు కేసరపల్లి వద్ద ఉదయం 11:27 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ప్రమాణ స్వీకార కార్యకమాన్ని నగర ప్రజలు తిలకించడానికి వీలుగా గుంటూరు నగరంలోని ప్రధాన కూడళ్ళు అయిన బస్టాండ్ వద్ద గల ఎన్.టి.ఆర్. సర్కిల్, బారా ఇమాం పంజా సెంటర్, పొన్నూరు రోడ్ లోని తూర్పు ఎంఎల్ఏ కార్యాలయం వద్ద, మాయా బజార్ సెంటర్, పాత గుంటూరు ఆంజనేయ స్వామి గుడి వద్ద, హిమని సెంటర్, ఏటుకూరు రోడ్ లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి గుడి వద్ద, నాజ్ సెంటర్, డొంక రోడ్ లోని ఓంకారం గుడి వద్ద, ఎన్.టి.ఆర్. స్టేడియం, శ్రీనివాసరావుపేటలోని పశ్చిమ నియోజకవర్గ ఎంఎల్ఏ కార్యాలయం వద్ద, గుజ్జనగుండ్ల సెంటర్, అమరావతి రోడ్, మిర్చి యార్డ్ వద్ద ఎల్.ఈ.డి. స్క్రీన్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, గాంధీ పార్క్ లను విద్యుత్ దీపాలతో అలంకరణ చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## ప్రతి నిర్మాణానికి అనుమతులు ఉండాలి



**బాపట్ల జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** బాపట్ల బావుడ పరిధిలో చేపట్టే ప్రతి నిర్మాణానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకునే విధంగా పంచాయతీ కార్యదర్శులు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు అవగాహన కల్పించాలని. బావుడ వైస్ చైర్మన్ బాబు రావు అన్నారు.మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులు తీసు కున్న అనంతరం నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకో వాలని అన్నారు. బాపట్ల,రేపల్లె,వేమూరు నియో జకవర్గాలతో పాటు,కాకుమాను, పెదనందిపాడు మండలాల పంచాయతీ కార్యదర్శులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బావుడ పరిధిలో ఉన్న రెండు పురపాలక సంఘాలతో పాటు పంచాయ తీలకు కూడా ప్రతి నిర్మాణంకు అనుమతులు తప్పనిసరి అని, ప్రతి నిర్మాణమునకు బహుళ అంతస్తులతో సహా అనుమతులు తీసుకున్న తర్వాత మాత్రమే నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాం తాలలో గ్రామ పంచాయితి పరిధిలో భవన నిర్మాణాలకు అనుమ తులను మ్యానువల్ గా కాకుండా ఆన్లైన్ విధానాన్ని బావుడ అమలు చేస్తుందని, ఆన్లైన్ విధానంలో లైసెన్సేడ్ టెక్నికల్ పర్సన ల్ ద్వారా దరఖాస్తు చేయించి పంచాయతీలకు సంబం ధించిన ఫీజులు, బావుడా అభివృద్ధి ఫీజులు చెల్లించిన తర్వాత పంచా యతీ కార్యదర్శులు అనుమతులు మంజూరు చేయాలని వివరిం చారు. 300 చదరపు మీటర్లు లోపు నిర్మించు నివాస భవన నిర్మాణములకు అనుమతి మంజూరు చేయు అధికారము పంచాయితీ కార్యదర్శులకు , ఆ పై స్థల విస్తీర్ణములలో , నివాసే తర నిర్మాణములకు అనుమతులు ఇచ్చు అధికారము బావుడా కు ఉందన్నారు.నూతన ఆన్లైన్ విధానంపై పంచాయతీలలో ప్రజలకు అవగాహన కల్పించి పంచాయతీ పరిధిలలో ప్రణాళికా బద్ధము గా భవనాలు , లేఔట్ లు నిర్మించి పంచాయితి ల అభివృద్ధికి పాటు పడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు బావుడ సిబ్బంది సమన్వయంతో పనిచేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచిం చారు. అనుమతుల మంజూరులో ఆలస్యం కాకుండా త్వరిత గతిన భవన నిర్మాణలకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్ డీఓ శంకర్రావు, డిఎల్ పిఓ స్వరూప రాణి , ఏపీఓ వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ ఎలీషా బాబు, పంచాయతీ కార్యదర్శులు, లైసెన్సేడ్ టెక్నికల్ పర్సన్స్ బావుడ సిబ్బంది నరేష్,దివ్య,భార్గవ్, పాల్గొన్నారు.

## 117 జీవోను రద్దుచేసి పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలి: ఏపిటీయఫ్




**బాపట్ల జూన్ 11 (ఆంధ్రపత్రిక) :**పాఠశాల విద్యా వ్యవస్థకి, ఉపా ధ్యాయ సంక్షేమానికి గొడ్డలిపెట్టుగా నిలిచిన 117జీవోను తక్షణమే రద్దు చేయాలని పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఏపిటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి రఘుబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాపట్ల పెన్షనర్ల అసోసియేషన్ హాల్ నందు మంగళవారం జరిగిన ఏపిటియఫ్ బాపట్ల జిల్లాశాఖ కార్యవర్గ సమావేశానికి జిల్లా శాఖ అధ్యక్షులు ఏ.శేఖర్ బాబు అధ్యక్ష వహించారు. సమావేశంలో రఘుబాబు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక తరగతుల విలీనాన్ని రద్దుచేసి పాఠశాల వ్యవస్థకు జీవం పోయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం పూనుకోవాలని కోరారు.పెండింగ్ లో ఉన్న డి.ఏ.బకా యిలను, గత సంవత్సరం స్పాట్ వాల్యుయేషన్ లో ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన రెమ్యునరేషన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షులు వై నేతాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయ సారథి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, కార్యకర్తలు విద్యారంగ ప్రగతికి అంకిత భావంతో కృషి చేసి, పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి,విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పి.డి సోష లిజం మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50వేల ఉపాధ్యాయ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సమావేశానికి బాపట్ల జిల్లా పరిధిలోని 26 మండల శాఖల కార్యకర్తలు హాజరయ్యారు.

## నగరపాలక సంస్థ అవినీతిపై ఏసీబీ విచారణ కోరతాం

**ఇంకా అధికారంలో ఉన్నామన్న భ్రమలో వైసీపీ కార్పొరేటర్లు- వైసీపీ నేతలకు బానిసలుగా ఉండ టానికి అధికారు లకు ఇంకా సిగ్గులేదా?- చిరు వ్యాపారులను బెదిరించటంపై అధికారులు, వైసీపీ నేతలపై మండిపడ్డ జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి**



**గుంటూరు : జూన్ 11( ఆంధ్రపత్రిక ):** వైసీపీ అరాచకాలకు, దుర్మార్గపు పాలనకు ప్రజలు ఛోరీ కట్టినా గుంటూరు నగర పాలక సంస్థ వైసీపీ కార్పొరేటర్లు మాత్రం తాము ఇంకా అధికా రంలో ఉన్నామన్న భ్రమలో ఉన్నారని జిల్లా జనసేన పార్టీ అధి కార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. వైసీపీ కార్పొరేటర్లు, ముఖ్య నేతలు అధికారులను అడ్డం పెట్టుకొని చిరు వ్యాపారులపై బెది రింపులకు దిగటంపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగ ళవారం ఆయన విలేఖరుల తో మాట్లాడుతూ గత మూడేళ్ళు గా కార్పోరేషన్ లో జరిగిన అవినీతి, అక్రమాలపై ఏసీబీ విచారణ కోరనున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా అవినీతి సొమ్ముకి అలవా టు పడ్డ కొంతమంది వైసీపీ నేతలకు ప్రజలు ఛీ కొట్టినా ఇంకా సిగ్గురాలేదని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీ కార్పొరేటర్లు , ముఖ్యనేతలు ప్రజల్ని రాబందుల కన్నా ఘోరంగా పీక్కుతు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకి జవాబు దారీగా ఉండాల్సిన కొంతమంది అధికా రులు వైసీపీ నేతలకు బానిసలుగా మారటం సిగ్గుచేట న్నారు. వైసీపీ నేతల మాటలు వింటే అధికారులకు శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదని హెచ్చరించారు. అధి కారులు కానీ వైసీపీ నేతలు కానీ ఎవరన్నా లంచం అడిగినా బెదిరింపు లకు పాల్పడినా కూటమి నేతల దృష్టికి తీసుకురావాలని ప్రజల్ని కోరారు.

కూటమి శాసన సభ్యుల ఆధ్వర్యంలో కొన్ని రోజుల్లో కార్పో రేషన్ పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరగనుందన్నారు. అవి నీతి, అక్రమాలు లేని పరిపాలన, మౌలిక సదుపాయాల రూప కల్పన కూటమి లక్ష్యమని ఆళ్ళ హరి అన్నారు. విలేకరుల సమా వేశంలో రెల్లి యువ నేత సోమి ఉదయ్ కుమార్ , డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ షర్ఫుద్దీన్, రఫీ, సాయి పాల్గొన్నారు.

## ఏమాత్రం ఏమరపాటుగా ఉంటే ఇంతే సంగతులు



**ఆగిరిపల్లి,జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి మండలం సింగన్నగూడెం టు విజయవాడ ఆర్ అండ్ బి రోడ్డు వెళ్లే దారిలో నిత్యం వందలాదిమంది ప్రయాణిస్తూ ఉంటారు.ఈ రహదారి వెంట తోటపల్లి,సింగనగూడెం, చిన్నాగిరి పల్లి గొల్లగూడెం, సర్నా ల గొల్లగూడెం, గ్రామ ప్రజలు విజయవాడ వెళ్లాలంటే ఈ రహదారి మీదుగానే వెళుతుంటారు. సింగనగూడెం చెరువు వాటర్ వల్ల తారు రోడ్డు కోతకు గురైంది అందువల్ల వచ్చి వెళ్లే వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా వున్నా చెరువులోకి వెళ్ళిపోవటం ఖాయం. మరొక చోట తారు రోడ్డు సగం మేర కుంగి పెద్ద గొయ్యి ఏర్పడటం వల్ల వాహనదారులకు చాలా ఇబ్బంది గా పరిణమించింది. ఈ విషయంపై తోటపల్లి, , చిన్న ఆగిరిపల్లి గొల్లగూడెం, సర్నా ల గొల్లగూడెం, సింగన్నగూడెం గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు ఇకనైనా స్పందించి కోతకు గురైన రహదారిని సిమెంటు కాంక్రీట్ వాల్ నిర్మించి , కుంగిన రోడ్డును బాగు చేయించవలసిందిగా కోరారు.

## ముఖ్య మంత్రి ప్రమాణ స్వీకారానికి కర్లపాలెం నుంచి బస్సు

**కర్లపాలెం, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర



ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయుచున్న నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం కార్య క్రమానికి కర్లపాలెం మండలం నుంచి బస్సు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో కే నేతాజీ తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 12వ తేదీ ఉదయం 6 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి బస్సు బయలుదేరుతుందని వెల్లడించారు.

## ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రభంజనం





**గుంటూరు : జూన్ 11( ఆంధ్రపత్రిక ) :**ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ జూనియర్ కాలేజీకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి అందరికంటే ముందు వరుసలో నిలిచారని విజ్ఞాన్ జూని యర్ కళాశాలల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ మంగళ వారం తెలిపారు. ఈ సందర్భంగా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జే.మోహన్‌రావు మాట్లాడుతూ వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలకు చెందిన ఐ . హనీత్ (387), టీ. సంజయ్ తేజ ( 494), ఏ. రోహన్ (904), సీ. రేవంత్ (957), పీ. అమర లోకేష్ (1015), పీ. గౌతమ్ ( 1195), కే.కారుణ్య ( 1206), ఎం. నాగ సాయి ప్రకాష్ ( 1219), బీ. యోగ విజయ్ కుమార్ ( 1369), సిహెచ్. వెంకట ఉదయ్ ఆదిత్య (1377), కే. దక్షిణ్ (1777), ఎం. వివేక్ పూజిత్ కుమార్ (1964) ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ప్రణాళికబద్ధమైన విద్యాబోధన వల్లనే అన్ని పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తు న్నారని వెల్లడించారు. 47 ఏళ్లకుపైగా అనుభవం, అవగాహనతో తాము విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉత్తమ ర్యాంకు లతో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ విద్యాసంస్థల ఉపాధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.మోహన్‌రావు, వై.వెంకటేశ్వరరావు, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి మంచి పేరు తీసుకువచ్చేందుకు హౌస్ సర్జన్ల కీలక పాత్ర పోషించాలి



**గుంటూరు , జూన్ 11( ఆంధ్రపత్రిక ):** ప్రభుత్వ ఆసుపత్రి లో అమలవుతున్న ఈ ఆసుపత్రి కి మంచి పేరు తీసుకుని వచ్చేందుకు హౌస్ సర్జన్ల పాత్ర కీలకం వంటిదని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. మంగళ వారం ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో లో ఈ ఆసుపత్రి అమలు పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రి లో కంప్యూటరీకరణ కు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ఆసుపత్రి ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రతి పేషంట్ రోగ సమాచారం కంప్యూటర్లలో పొందు పర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల రోగులకు సంబంధించిన సమాచారం కంప్యూటర్లలో నిక్షిప్తంగా ఉంటోందన్నారు.

అవసరమైన సమయంలో రోగి తెలుసుకునేందుకు ఎంతో తోడ్పాటు ఉంటుంద న్నారు. రోగి ఓపి నెంబర్ తో పాటు ల్యాబ్, ఎక్స్ రే విభాగం వైద్య చికిత్స వంటి సమాచారం పూర్తిగా కంప్యూటరీకరణ చేసే విధంగా పని చేయాలన్నారు. అమెరికా, లండన్ వంటి దేశాల్లో పూర్తిగా పేపర్ రహితంగా ఉంటుందన్నారు.. ఆ దేశాల సరసన మనం కూడా ఆ స్థాయికి చేరుకోవాలని అయన సూచించారు. ఈ కార్యక్రమం లో సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ వెంకట రమణ, ఈ ఆసుపత్రి విభాగం మేనజర్ ప్రదీప్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన అద్దంకి నియోజకవర్గం (సెర్ప్) గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది



**కొరిశపాడు,జూన్ 11 (ఆంధ్రపత్రిక):** అద్దంకి నియోజకవర్గం లోని ఐదు మండలాల్లోపనిచేస్తున్న గ్రామీణాభివృద్ధి సంస్థ(సెర్ప్) ఉద్యోగులు అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ గారిని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసిపుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు ఈ సందర్భంగా కలిసిన వారిలోఅద్దంకి నియోజకవర్గ ఏరియా కోఆర్డినేటర్ కాకి రవికుమార్ మాట్లా డుతూ 2002 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1000 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో వెలుగుసంస్థను ప్రారంభించి వేలాది మందికి జీవనోపాధి కల్పించారని తెలిపారు. ప్రతి మండలంలో మండల సమాఖ్య కార్యాలయం ఏర్పాటుచేసి సామాజిక పెట్టుబడినిది కింద మండలానికి కోటి రూపాయల నిధులు కేటాయించి ఆనిధులతో మండలసమాఖ్య ఆర్థికంగా ఎదగాలని మండల సమైక్య, గ్రామ సమాఖ్యల పర్యవేక్షణకు సీసీలు ఏపీఎంలు మాస్టర్ బుక్ కీపర్ లను నియమించారని తెలిపారు. ప్రతి గ్రామంలో చిన్న చిన్న స్వయంసహాయసంఘాలు, గ్రామసమాఖ్యలు ఏర్పాటు చేయుటకు తోడ్పాటు అందించారని ప్రతి మహిళ ఆర్థికంగా ఎదుగుటకు వెలుగు (సిఐ ఫ్)రుణాలు బ్యాంకురుణాలు రివ్యాలింగ్ పండు గ్యాస్ సిలిండర్లు అందించారని తెలిపా రు. రాబోయే రోజుల్లో స్వయం సహాయ సంఘాలు, గ్రామ సంఘాలు మండల సమాఖ్యలు ఆర్థికంగా బలపడుటకు (సెర్ప్) గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది అందరం కలిసికట్టుగా పనిచేస్తామని ఎమ్మెల్యే గారికి తెలిపారు.ఎమ్మెల్యే కలిసిన వారిలో ఏరియా కోఆర్డినేటర్ కాకి రవికుమార్ తో పాటు పీఎంలు చవలంకోటేశ్వరరావు, దుడ్డుమస్తాన్ భాచిన సురేంద్రబాబు,జ్యోతి ప్రసాద్ బాబు బండ్ల అనురాధ అద్దంకి నియోజకవర్గ లీగల్ కోఆర్డినేటర్ కోరే విజయ్ భాస్కర్ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ఉన్నారు.

## అమరవీరుడు రాంప్రసాద్ బిస్మిల్‌కు నివాళి



**బాపట్ల,జూన్ 11 (ఆంధ్రపత్రిక):** భారతదేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం నవ్వుతూ ఉరికంభాన్ని అధిరోహించిన త్యాగమూర్తులలో రాంప్రసాద్ బిస్మిల్ ప్రముఖులని అబ్దుల్ ఖాదర్ జీలానీ అన్నారు. మంగళవారం అమరవీరుడు రాం ప్రసాద్ బిస్మిల్ 127 వ జయంతి సభ నిర్వహించారు. బిస్మిల్ ,అజ్ఞాత్, రామ్ అనే కలం పేర్లతో దేశభక్తిని ప్రేరేపించే రచనలు చేశారని తెలియజేశారు. సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ రాంప్రసాద్... చంద్రశేఖర్ ఆజాద్ అష్ఫాఖు ల్లా ఖాన్ ,భగత్ సింగ్ వంటి అమరవీరులకు స్ఫూర్తి ప్రదాత అన్నారు. ప్రజా కవి వైద్య విద్వాన్ డాక్టర్ శ్రీనివాసులు శ్రీనివాస్ మాట్లాడుతూ విప్లవ కార్యక్రమాలకు వలయు ఆయుధ సంపత్తిని సమకూర్చుకోవటానికి ఉత్తర ప్రదేశ్ లోని కాకోరి అనే ప్రాంతంలో రైలు దోపిడీ చేశారన్నారు. ఈ సంఘటన రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని దిగ్భ్రాంత పరచిందన్నారు. నివ్వెర పోయిన బ్రిటిష్ సామ్రాజ్యం రాంప్రసాద్ బిస్మిల్ ను ఉరితీసిందన్నారు. మర్రి మాల్యాద్రి రావు మాట్లాడుతూ బిస్మిల్ హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ అనే విప్లవ సంస్థను స్థాపించారన్నారు .వీరు ఎన్నో బెంగాలీ గ్రంథాలను హిందీ భాషలోకి అనువదించారు అన్నారు. ఈ సభలో ఆదం షఫీ, ఏం జాకబ్ కస్తూరి శ్రీనివాసరావు బొడ్డుపల్లి శ్రీరామ చంద్ర మూర్తి పువ్వాడ వెంకటేశ్వర్లు కొమ్మూరి సీతా రామాంజ నేయులు రాంప్రసాద్ బిస్మిల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

## బాపట్ల జగనన్న కాలనీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



**బాపట్ల,జూన్ 11 (ఆంధ్రపత్రిక):** బాపట్ల మూలపాలెం జగనన్న కాలనీలో మంగళవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహించారు. కమిషనర్ బి. శ్రీకాంత్ ఆదేశాల మేరకు, శానటరీ ఇన్స్పెక్టర్ డి. కొండయ్య మార్గదర్శకంలో శారిటరీ మేస్త్రి ముస్తఫా ఆధ్వర్య ంలో పారిశుద్ధ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. మొత్తం మూడు ట్రాక్టర్లలో కార్మికులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి మూలపాలం లేఅవుట్కు వెళ్లే ప్రధాన రహదారి ఇరుపక్కల ఉన్న చెత్త కుప్పలను శుభ్రం చేశారు. అలాగే కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి వ్యర్థపదార్థాలు క్యారీ బ్యాగులను సేకరించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ డీ. కొండయ్య మాట్లాడుతూ ఇకనుంచి వారంలో మూడు రోజులు జగనన్న కాలనీలో గ్యాంగ్ వర్క్ నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా పారిశుద్ధ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. పట్టణంలో పారిశుద్ధ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి బాపట్ల జిల్లా కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తామన్నారు.

## బాపట్లలో ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ దీపాల ఏర్పాటు



**బాపట్ల,జూన్ 11 (ఆంధ్రపత్రిక):** బాపట్ల పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయ భవనాల కు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్తగా ప్రభుత్వం ఏర్పడు తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నేడు ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయుచున్న సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించి నూతన ప్రభుత్వానికి స్వాగతం పలికేలా ఏర్పాట్లు జరిగాయి. పట్టణంలో అన్ని కార్యాలయాలు విద్యుత్ దీపాలతో దగదగా మెరిసిపోవటంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

# మౌంట్ కార్మెల్ హై స్కూల్‌పై చర్యలు తీసుకోవడంలో ఎంఈఓలు విఫలం

**గురువారంలోపు చర్యలు తీసుకోలేని పక్షంలో జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్తాం.. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఈరేష్ డిమాండ్..**




**కర్నూలు, జూన్ 11(ఆంధ్రపత్రిక):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కోసిగి మండల ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓలు రాకపోవడంతో కాళి కుర్చీకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహయ కార్యదర్శి ఎస్.ఈరేష్ కోసిగి మండల కార్యదర్శి ఎం.అంజి మాట్లాడుతూ కోసిగి మండలం విద్యాశాఖ అధికారులు మౌంట్ కార్మెల్ హై స్కూల్ యాజమాన్యంతో కుమ్మక్కై వారిచే ముడుపులకు కక్కుర్తి పడి మౌంట్ కార్మెల్ స్కూల్ పై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెందారు. అని అన్నారు. మౌంట్ కార్మెల్ హై స్కూల్ లో ఎన్నో సంవత్సరాలుగా అక్రమాలు జరుగుతున్నాయని ఎన్నోసార్లు తెలియజేసినప్పటికీ విద్యాశాఖ అధికారులు ఎంఈఓ 1.మోయిన్ నుద్దీన్ ఎంఈఓ 2.నాగేశప్పలు పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థి తల్లిదండ్రుల జీవితాలతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. అలాగే ఎంఈఓ లు ప్రభుత్వ కార్యాలయాలకు రాకుండా ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తూ పూర్తి స్థాయిలో విద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారి డిఈఓ జిల్లా కలెక్టర్ స్పందించి విద్యాశాఖ కార్యాలయాలకు రాకుండా వ్యవహరిస్తున్న కోసిగి ఎంఈఓలు మోయిన్ నుద్దీన్ ఎంఈఓ 2. నాగేశప్ప పైనా అలాగే విద్యను వ్యాపారంగా మార్చినా మౌంట్ కార్మెల్ స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి డిఈఓ జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సన్నీ నరసింహులు మల్లికార్జున గురుస్వామి హనుమంత తదితరులు పాల్గొన్నారు.

## టీడీఎల్పీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**నారా లోకేష్‌ని కలసి శుభాకాంక్షలు తెలిపిన కేపీ**



**మైలవరం, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** టీడీఎల్పీ సమావేశంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. విజయవాడలో ఏ కన్వెన్షన్ సెంటర్లో టీడీఎల్పీ సమావేశం మంగళవారం జరిగింది. టీడీఎల్పీ నేతగా అధినేత నారా చంద్రబాబునాయుడు పేరును పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ప్రతిపాదించారు. అనంతరం శాసనసభ పక్ష నేతగా నారా చంద్రబాబునాయుడు పేరును జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడలో నారా లోకేష్‌ని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

**డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు**



**గుంటూరు, జూన్ 11( ఆంధ్రపత్రిక):** ఈ నెల 15,16,17 తేదీలలో స్టెప్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో ఉచితంగా పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ నిర్వహిస్తున్నామని డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, స్టెప్ ప్రిన్సిపల్ డాక్టర్. బత్తుల క్రిష్ణయ్య, రాష్ట్ర కోఆర్డినేటర్ కె .పావని ఒక ప్రకటనలో తెలియ చేశారు. స్థానిక కొరిటెపాడు లోని స్టెప్ కార్యలయంలో మంగళవారం ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. నేటి విద్యార్థులలో, ఉపాధ్యాయులలో, తల్లితండ్రులలో ఉన్న శక్తి, సామర్థ్యాలను వెలికి తీయడానికి, వారిలో ఉన్న ఆత్మన్యూనత భావాన్నీ పోగొట్టి, ఆత్మవిస్వాసాన్ని నింపి వారు ఉన్న రంగంలో శక్తి వంతులుగా తీర్చిదిద్ది మంచి సమాజం ఏర్పాటు కోసం ఏర్పాటు కోసం జరుగుతున్న ఈ ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను వినియోగించు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఉచిత భోజన, వసతి ఏర్పాటు చేసి నిష్ణాతులైన సైకాలజిస్టులు, వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణ ఇవ్వబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మారెడ్డి, శరత్, మల్లికార్జున్, సతీష్ బాబు, రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ శిక్షణకు హాజరు కావాలనుకునేవారు.

## ఎంసెట్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యా సంస్థల ప్రభంజనం

**వరుసగా 1నుండి 9 ర్యాంకులు కైవసం**
**98.7 పర్సంటేజ్ క్వాలిఫైతో రికార్డు**





**గుంటూరు ప్రతినిధి జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** ఎంసెట్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు స్టేట్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ విభాగంలో ఒకటి నుండి తొమ్మిది ర్యాంకులను కైవసం చేసుకున్నారు. మంగళవారం విడుదలైన ఫలితాలలో గుంటూరు శ్రీ చైతన్య క్యాంపస్ నుండి 29వ ర్యాంకు కె జస్వంత్ కుమార్, 58 ర్యాంక్ హరి, సాయి శ్రీ తేజ, 77 ర్యాంకును ముత్యమని దీప్,88 ర్యాంకును సయ్యద్ రయాన్ అహ్మద్,నోట 111 ర్యాంకును కే వెంకట ప్రసూన్,131 ర్యాంకు ఎం శివజ్యోతి రాధిత్య, 134 ర్యాంక్ చల్ల ఏషియన్ ప్రనిల్, 143 ర్యాంక్ సాయి ప్రణవ్, 144 ర్యాంక్ కౌశల్ మాధవ్,164 కే ధనుష్, 174 ర్యాంక్ బి అభిలాష్,183వ ర్యాంక్ అవినాష్ నాయుడు, 194 ర్యాంక్ సుమంత్ రెడ్డి సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. వెయ్యిలోపు ర్యాంకులను 125 మంది 2000 లోపు ర్యాంకులను 151 మంది 5000 లోపు ర్యాంకులను 352 మంది పదివేల లోపు ర్యాంకులను 851 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు ఈ ర్యాంకులతో 98.7శాతం క్వాలిఫై సాధించడం జరిగినది. ఈ సందర్భంగా విద్యార్థులను ఎగ్జిక్యూటివ్ ఏజియమ్ దుర్గా ప్రసాద్, డీన్ కిషోర్, డీన్ చంద్రశేఖర్, డీన్ సురేష్సీ,నియర్ అధ్యాపకులు మరియు అన్నీ క్యాంపస్ల ప్రిన్సిపాల్స్ అభినందించారు.

## నేడు ప్రైవేటు విద్యా సంస్థలకు స్థానిక సెలవు

రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్.చంద్రబాబు నాయుడు గన్నవరం మండలం, కేసరపల్లి ఐటీ పార్కు వద్ద ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, ట్రాఫిక్ సమస్యలు ఎదురు కాకుండా ఉండేందుకు విజయవాడ సిటీ, విజయవాడ రూరల్ పరిధిలోని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, ఇతర సెంట్రల్ బోర్డ్ ప్రైవేటు విద్యా సంస్థలతో సహా అన్ని ప్రైవేటు విద్యా సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ సూచనలు పాటించాలని కోరారు. 2024-2025 విద్యా సంవత్సరానికి 12.06.2024కి బదులుగా అన్ని పాఠశాలలు 13.06.2024 నుండి పాఠశాలలను తిరిగి తెరవాలని పాఠశాల విద్యా శాఖ మెమో కూడా ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిగా ఎన్. చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి గౌరవ ప్రధానమంత్రి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖ వీఐపీలు హాజరుకానున్నారని వివరించారు.

## ఆర్క్ విద్యాసంస్థల విద్యార్థుల విజయకేతనం



**గుంటూరు ప్రతినిధి, జూన్ 11(ఆంధ్రపత్రిక) :** ఎంసెట్ ఫలితాలలో ఇంజనీరింగ్ విభాగంతో పాటు బైపీసీ విద్యార్థులు కూడా అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు డైరెక్టర్ అనిల్ కుమార్ మీడియా ప్రజల ను తెలిపారు. మంగళవారం ప్రకటించిన ఇంజనీరింగ్ విభాగంలో ఇద్దరు విద్యార్థులు, వెయ్యిలోపు ర్యాంకులు, 5000 లోపు ర్యాంకులను 14 మంది , పదివేల లోపు ర్యాంకులను 32 మంది, 15 వేల లోపు ర్యాంకులు 65 మంది, 20,000 లోపు ర్యాంకులు 90 మంది సాధించినట్లు తెలిపారు. బైపీసీ లో కూడా 202 ర్యాంకుతో పాటు, 500 లోపు ర్యాంకులు 4 గురు, వెయ్యిలోపు ర్యాంకులు 8 మంది, 5000 లోపు ర్యాంకులు 35 మంది, 10000 లోపు ర్యాంకులను 80 మంది సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్య సంస్థల డైరెక్టర్ అనిల్ కుమార్ తో పాటు వాసు బాబు, డిం శ్రీనివాసరావులను విద్యార్థుల తల్లిదండ్రులుఅభినందించారు.

## ఘనంగా శ్రీ గంగమ్మ తల్లి అమ్మవారికి జ్యోతుల మహోత్సవం



**హిందూపురం, జూన్ 11 (ఆంధ్రపత్రిక) :** మునిసిపల్ పరిధిలోని కొటిపి రోడ్డులోని 2వ మోడల్ కాలనీలో వెలసిన శ్రీ గంగమ్మ తల్లి అమ్మవారికీ హిందూపురం తాలూకా బెస్త సేవా సంఘం అద్వర్యంలో జ్యోతుల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెస్త కులస్థులు పెద్ద ఎత్తున అమ్మవారికి జ్యోతులు, దీపాలు మోసి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తాదులకు తీర్థ ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. అదేవిదంగా మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, మునిసిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్ గిరి తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ కాంతులతో ప్రభుత్వ కార్యాలయాలు



**కొరిశపాడు, మే11(ఆంధ్రపత్రిక):** ఈరోజు నూతనంగా ఏర్పడబోయే కొత్త ప్రభుత్వానికి స్వాగతం పలుకుతూ. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ కాంతులతో ముస్తాబు చేయాలని.ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండల కేంద్రమైన కొరిసపాడులో ఎంపీడీవో కార్యాలయం, తాహసిల్దార్ కార్యాలయం, వెలుగుకార్యాలయము, ఉపాధి హామీ కార్యాలయము ఐసిడిఎస్ కార్యాలయమునకు విద్యుత్ కాంతులతో నింపారు. మూడు రోజులుపాటు రోజు ఏర్పాటు చేయాలని ఆయా శాఖల ప్రధాన కార్యదర్శులు జిల్లాలో సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశారు. ఈఉత్తర్వులు ప్రకారము జిల్లాలోని అన్ని మండల కేంద్ర కార్యాలయలాల లోవిద్యుత్ కాంతులు మండలంలోని ప్రధాన శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. నూతన ప్రభుత్వంలో అన్ని శాఖలు అభివృద్ధి పథంలో నడవాలని. మండల ప్రజల కోరుకుంటున్నారు.

## విద్యుత్ దీపాలతో తాసిల్దార్ కార్యాలయం అలంకరణ



**పాలసముద్రం మండలం, జూన్11(ఆంధ్రపత్రిక):** నేడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఉదయం తొమ్మిది గంటల నుండి మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలకు ప్రజా ప్రతినిధులు వీక్షించేలా తాసిల్దార్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు వీక్షణ ఏర్పాటు చేయడమైనది. కావున ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది మరియు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించబడినది.

## ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి బయలుదేరిన టిడిపి నాయకులు



**లేపాక్షి, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగవసారి విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా లేపాక్షి మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో లేపాక్షి మండల నాయకులు కార్యకర్తలు బయలుదేరారు. ఇందులో భాగంగా లేపాక్షి నుంచి మండల కేంద్ర మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్ ప్రభాకర్ రెడ్డి శ్రీనివాసులు రమేష్, డిష్ మంజునాథ, కంచి సముద్రం చంద్ర బుల్లెట్ రవి, గోవిందప్ప సేక్షావలి నాయన పల్లి సదాశివరెడ్డి నారాయణ బయలుదేరారు. ప్రమాణస్వీకారం ముగిసిన తర్వాత తిరిగి గ్రామానికి వస్తారని నాయకులు తెలియజేశారు.

## మాస్ మహారాజా రవితేజ 75వ చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభం

**విజయవాడ, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** మాస్ మహారాజా రవితేజ ఎందరో ఔత్సాహిక దర్శకులకు, నటీనటులకు స్ఫూర్తి. తన ప్రత్యేకమైన కామెడీ టైమింగ్, మాస్ యాటిట్యూడ్, విలక్షణమైన డైలాగ్ డెలివరీతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. స్వయంకృషితో స్టార్‌గా ఎదిగిన రవితేజ, యువ ప్రతిభను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారు. అలా యువ దర్శకులతో పని చేసి పలు బ్లాక్ బస్టర్ చిత్రాలను, గుర్తుండిపోయే పాత్రలను అందించారు. తెలుగు చిత్రసీమలో అత్యంత విజయవంతమైన నిర్మాణ సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి రవితేజ 75వ చిత్రాన్ని ప్రొడక్షన్ నంబర్ 28 గా నిర్మిస్తోంది. యువ రచయిత భాను బోగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మాస్ మహారాజా రవితేజ పేరు వినగానే గుర్తొచ్చేది మాస్, కామెడీ. తనదైన మాస్ యాటిట్యూడ్, కామెడీ టైమింగ్ తోనే ఆయన ఎందరో అభిమానులను సొంతం చేసుకున్నారు. ఇప్పుడు రవితేజ తన 75వ చిత్రంలో హాస్యంతో కూడిన మాస్ పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం వెల్లడించింది. వినోదంతో కూడిన పూర్తిస్థాయి మాస్ పాత్రలో రవితేజను చూడాలని అభిమానులు ఎంతగానో ఎదురుచూ స్తున్నారు. ఈ చిత్రంతో అభిమానుల కోరిక నెరవేరుతుందని చిత్ర బృందం హామీ ఇచ్చింది. బ్లాక్ బస్టర్ చిత్రం 'వాల్తేరు వీరయ్య'కి మాటల రచయితగా, మరో బ్లాక్ బస్టర్ 'సామజవరగమన'కు కథ, స్క్రీన్‌ప్లే రచయితగా పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు భాను బోగవరపు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'NBK109'కి సంభాషణలు అందిస్తున్నారు. ఇలా రచయితగా అనతి కాలంలోనే తనదైన ముద్ర వేసిన భాను బోగవరపు, ఇప్పుడు రవితేజ కెరీర్ లో ఓ మైలురాయి లాంటి ఈ చిత్రంతో దర్శకుడిగా మారుతున్నారు. ఈ చిత్రంతో అదిరిపోయే మాస్ ఎంటర్‌టైనర్‌ను అందించడానికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో యువ సంచలనం శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. రవితేజ-శ్రీలీల జోడి గతంలో "ధమాకా"తో బ్లాక్ బస్టర్ హిట్ అందించారు. అలాగే "ధమాకా" విజయంలో కీలకపాత్ర పోషించిన సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూరు స్తున్నారు.



ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణుడు విధు అయ్యన్న ఛాయాగ్రాహకుడిగా వ్యవరిస్తున్న ఈ చిత్రానికి, శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భాను కథ-కథనం అందించిన ఈ చిత్రానికి నందు సవిరిగాన సంభాషణలు రాస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఈ చిత్రానికి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. జూన్ 11వ తేదీన ఉదయం 07:29 గంటలకు పూజా కార్యక్రమంతో మేకర్స్ అధికారికంగా ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ముహూర్తపు షాట్ కి శ్రీలీల క్లాప్ కొట్టగా, భాను బోగవరపు దర్శకత్వం వహించారు. నేటి నుంచే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్ టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

తారాగణం: రవితేజ, శ్రీలీల, కథ, కథనం, దర్శకత్వం: భాను బోగవరపు, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న కూర్పు: నవీన్ నూలి ,సంభాషణలు: నందు సవిరిగాన,కళ: నాగేంద్ర తంగాల, పి ఆర్ ఓ: లక్ష్మీవేణుగోపాల్, బ్యానర్: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, సమర్పణ: శ్రీకర స్టూడియోస్

## భీమా జ్యువెలర్స్ కొత్త వెడ్డింగ్ కలెక్షన్ కహానీ - బ్రైడల్ స్టోరీస్



**విజయవాడ, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** నమ్మకం, నాణ్యతకు పర్యాయపదంగా నిలిచిన భీమా జ్యువెలర్స్, తమ సరికొత్త వెడ్డింగ్ కలెక్షన్, 'కహానీ – బ్రైడల్ స్టోరీస్ పై ఆవిష్కరించింది. పేరుకు తగినట్లుగా, ఈ కలెక్షన్‌లో ప్రతి ఆభరణం ఒక ప్రత్యేకమైన కథను చెబుతుంది. ప్రయాణాన్ని వివరిస్తూ, తమ ప్రత్యేక రోజున సమకాలీన వధువుల అవసరాలను తీరు స్తుంది. అసమానమైన హస్తకళా నైపుణ్యం, సూక్ష్మ అంశాల పట్ల కూడా చూపే నిశిత శ్రద్ధకు, భీమా యొక్క అచంచలమైన నిబద్ధతకు ఈ సున్నితమైన కలెక్షన్ నిదర్శ నంగా నిలుస్తుంది. ప్రతి వధువు మరపురాని ప్రకాశంతో ప్రకాశించేలా చేస్తుంది. ఆమె ధరించిన ఆభరణాల వల్లే ఆమె ప్రయాణాన్ని చిరస్మరణీయం చేస్తుంది. ఈ కలెక్షన్ లో అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నెక్లెస్లు, మిరుమిట్లు గొలిపే చెవిపోగులు, సొగసైన గాజులతో సహా సూక్ష్మంగా రూపొందించిన ఆభరణాల శ్రేణిని కలిగి ఉంది.

# నీట్ పరీక్ష రద్దు చేయడం కుదరదు

(మొదటిపేజీ తరువాయి)

జరిపింది. పరీక్షను రద్దు చేయడం అంత సులువు కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇది మీరు అనుకున్నంత సులభం కాదు. అలా చేస్తే పరీక్షకు ఉన్న గౌరవం, పవిత్రత దెబ్బతింటాయి. అందువల్ల ఈ ఆరోపణలపై మాకు సమాధానాలు కావాలని ధర్మాసనం పేర్కొంది. దీనిపై స్పందన తెలియజేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి నోటీసులు జారీ చేసింది. ఇక, ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల కౌన్సిలింగ్ ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. ఆలోగా ఎన్‌టీఏ తమ సమాధానం తెలియజేయాలని కోర్టు ఆదేశించింది. ఈ ఏడాది మే 5వ తేదీన నీట్ యూజీ -2024 ప్రవేశ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. జూన్ 4న ఫలితాలను ప్రకటించారు. అయితే తొలుత జూన్ 14న ఫలితాలను వెల్లడిస్తామని చెప్పి.. అంతకంటే ముందే ఓట్ల లెక్కింపు జరుగుతుండగా విడుదల చేయడం వివాదానికి దారితీసింది. ఈ ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా మొదటి ర్యాంక్ రాగా, వారిలో ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం పలు అనుమానాలకు దారితీసింది. ఈ పరీక్షలో పేపర్ లీకేజీ జరిగిందని, ఫలితాల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ సహా పలు విపక్షాలు ధ్వజమెత్తాయి. దీంతో ఆరోపణలపై విచారణకు యూపీఎస్సీ మాజీ ఛైర్మన్ సారథ్యంలో నలుగురు సభ్యులతో కమిటీ వేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలోనే దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో బాబు భేటీ

**విజయవాడ, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయడానికి రంగం సిద్ధం అయ్యింది. దీనికి సంబంధిం చిన ప్రక్రియ కూడా పూర్తయింది. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మంగళవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నారా చంద్రబాబు నాయుడును గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆహ్వా నించారు. ఆ క్రమంలో తనకు మద్దతు ఇచ్చిన 163 మంది ఎమ్మెల్యేల జాబితాను ఈ సందర్భంగా గవర్నర్‌కు చంద్రబాబు అందజేశారు. భేటీ అనంతరం రాజభవన్ నుంచి ఉండవల్లి నివాసానికి బయలుదేరి వెళ్లారు. అంతకుముందు కూటమి నేతలు నాదెండ్ల మనోహన్, అచ్చెంనాయుడు, పురందేశ్వరిలు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలసి చంద్రబాబును నాయుకుడిగా ఎన్నుకున్నట్లు లేఖ అందించారు. ఆయనను సిఎంగా ఆహ్వా నించాలని కోరారు. దీంతో చంద్రబాబు ప్రమాణానికి లైన్ క్లీయర్ అయ్యింది. రాజ్‌భవన్‌లో ఆంధప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎన్డీయే కూట మి నేతలు కలిశారు. టీడీపీ తరపున అచ్చెన్నాయుడు, బిజెపి నుంచి పురంధేశ్వరి, జనసేన నుంచి నాదెండ్ల మనోహర్ గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. సభా నాయకుడిగా చంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ చేసిన తీర్మానాన్ని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేశారు. 164 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్‌కు ఎన్డీయే కూటమి నేతలు లేఖ ఇచ్చారు. ఈ తీర్మానాన్ని పరిశీలించిన గవర్నర్.. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కూటమి నేతలను ఆహ్వానించారు.

# జనసేన పక్ష నేతగా పవన్

**అమరావతి, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** జనసేన శాసనసభ పక్ష నాయకుడిగా పవన్ కల్యాణ్ ఎన్నికయ్యారు. మంగళవారంఉదయం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన శాసనసభ పక్ష సమావేశం నిర్వహించారు. తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ఈ సమావేశంలో జనసేన శాసనసభ పక్ష నాయకుడిగా పవన్‌ను ప్రతిపాదించారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా బలపరిచారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 164 సీట్లు సాధించిన విషయం తెలిసిందే. కూటమిలో భాగమైన జనసేన 21 సీట్లు గెలుచుకుంది. అయితే ఈ నెల 12వ తేదీన ఏపీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చంద్రబాబుతో పాటు మరికొంతమంది కూటమి ఎమ్మెల్యేలు కూడా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. జనసేన నుంచి 4 మంత్రి పదవులను అడుగుతారని తెలుస్తోంది. పవన్‌కు డిప్యూటీ సీఎం పదవి ఖరారైనట్టు సమాచారం. తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌కు సైతం మంత్రి పదవి దక్కనుందని టాక్. అయితే సోషల్ మీడియాలో మరో రెండు పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. వాటిలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌లను మంత్రులుగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని జోరుగా ప్రచారం జరుగుతోంది. జనసేన కేంద్ర కార్యాలయంలో సోమవారం పవన్ కళ్యాణ్ కీలక నేతలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై పవన్ చర్చించారు. మంత్రి వర్గంలో పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌తో పాటు మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఎవరనే దానిపైనా చర్చించినట్టుగా తెలుస్తోంది.

# ఒడిషా సిఎంగా మోహన్ మాఝీ

(మొదటిపేజీ తరువాయి)

ఎంపికయ్యారు. డిప్యూటీ సీఎంలుగా కేవీ సింగ్ డియో, ప్రవతి పరిదా లకు అవకాశం లభించింది. మాఝీని బీజేపీ శాసనసభా పక్ష నేతగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. మోహన్ మాఝీ కియోంజర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. వీరు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ , బీజేపీ అగ్రనేతలు, పార్టీ ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 147 స్థానాలకు గాను 78 సీట్లు గెలుచుకుని తొలిసారిగా రాష్ట్రంలో బీజేపీ సొంతంగా అధికారంలోకి వచ్చింది. 2000, 2004లో బీజేడీ కూటమి భాగస్వామిగా బీజేపీ రాష్ట్రాన్ని పాలించింది

# ఏపీలో ఎయిర్‌పోర్ట్‌ల అభివృద్ధికి కృషి

## కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

**అమరావతి, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** ఏపీలో ఎయిర్‌పోర్ట్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులను జెట్ స్పీడ్‌తో పూర్తి చేసి, విమానాల రాకపోకలను ప్రారంభించడే తన తొలి లక్ష్యమన్నారు. ఈ శాఖ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో విమానయాన మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, కొత్త అవకాశాలను వెతకడం సాధ్యపడుతుందని అన్నారు. పౌర విమానయాన శాఖ మంత్రి బాధ్యతలను ప్రధాని మోదీ ఏరి కోరి తనకు అప్పగించారని చెప్పారు. తనపై మోదీ ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతానని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో భారత దేశ కీర్తి ప్రతిష్టలను పెంపొందించడంలో పౌర విమానయాన శాఖ పాత్ర చాలా ఉందన్నారు.





చంద్రబాబు ప్రమాణానికి విచ్చేసిన జేపి నడ్డా, అమిత్ షాలకు స్వాగతం పలికిన నారా లోకేష్

# మన రాష్ట్ర రాజధాని అమరావతే



(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబును ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రజలు చొరవ చూపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. 14 ఏళ్లుగా సీఎంగా, 15 ఏళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నాను. ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని ముందుకెళ్లాం. ఏపీలో చాలా సమస్యలు ఉన్నాయి. రాష్ట్రం పూర్తిగా శిథిలమైంది. సంక్షోభంలో ఉంది. అన్ని వర్గాలు దెబ్బతిన్నాయి. రైతులు అప్పులపాలయ్యారు. పదేళ్ల తర్వాత రాజధాని ఏదంటే చెప్పుకోలేని పరిస్థితి. కక్షపూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మకంగా ముందుకు వెళ్లాలి. మూడు రాజధానులంటూ ఆటలాడే పరిస్థితి ఉండదు. అమరావతి రాజధానిగా ఉంటుంది. విశాఖను ఆర్థిక, ఆధునిక రాజధానిగా చేసుకుందాం అన్నారు. అలాగే కర్నూలును కూడా అభివృద్ధి చేద్దామని అన్నారు. నూటికి నూరు శాతం 3 పార్టీల నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేశారు. ఎన్నికల్లో 93 శాతం సీట్లు గెలవడం దేశ చరిత్రలో అరుదు. ఎన్నికల్లో 57 శాతం ఓట్లతో ప్రజలు ఆశీర్వదించారు. ప్రజల తీర్పుతో మనందరిలో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లోనూ గెలుపొందింది. భాజపా పోటీ చేసిన 10 స్థానాల్లో 8 సీట్లు గెలుచుకుంది. ప్రజలు ఇచ్చిన తీర్పు వల్ల దిల్లీలో అందరూ గౌరవించారు. ప్రజల తీర్పుతో రాష్ట్ర ప్రతిష్ఠ పెరిగింది. పవన్‌కల్యాణ్ సమయస్ఫూర్తిని ఎప్పటికీ మరచిపోలేను. నేను జైలులో ఉన్నప్పుడు ఆయన వచ్చి పరామర్శించారు. తెదేపా, జనసేన పొత్తు పెట్టుకుంటున్నట్లు చెప్పారు. భాజపా, తెదేపా జనసేన కలిసి పోటీ చేస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పొత్తు పెట్టుకున్నాం. ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా కలిసి పనిచేశాం..విజయం సాధించామని అన్నారు. మీ అందరి సహకారంతో బుధవారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్నా. కార్యక్రమానికి ప్రధాని మోదీ, ఎన్డీయే నేతలు హాజరవుతున్నారు. సమష్టిగా ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైంది. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర సహకారం అవసరం. రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తామని కేంద్ర నేతలు చెప్పారని అన్నారు. ఓటర్లు ఇచ్చిన తీర్పు రాష్ట్ర చరిత్రలో నిలుస్తుంది. పదవి వచ్చిందని విర్రవీగితే ఇదే పరిస్థితి వస్తుంది. తప్పు చేసిన వారిని క్షమిస్తే అలవాటుగా మారుతుంది. తప్పు చేసిన వారికి చట్టపరంగా శిక్ష పడాల్సిన అవసరం ఉంది. విధ్వంస, కక్షా రాజకీయాలను ప్రక్షాళన చేయాలి. నా కుటుంబానికి అవమానం జరిగింది. గౌరవ సభ కాదు.. కౌరవ సభ అని చెప్పి బయటకు వచ్చా. ప్రజాక్షేత్రంలో గెలిచి గౌరవ సభగా చేసి అడుగు పెడతానని చెప్పా. నా శపథాన్ని ప్రజలు గౌరవించారు. గౌరవించిన ప్రజలను నిలబెట్టాలి. పోలవరం పనులు 72 శాతం పూర్తి చేశాం. డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది. కేంద్ర సహకారంతో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం. నదులను అనుసంధానించి ప్రతి ఎకరానికి నీళ్లందిస్తాం అని అన్నారు. సీఎం పర్యటనల సందర్భంగా షాపులు బంద్ చేయడం, రోడ్లు మూసేయడం, పరదాలు కట్టుకోవడం అవన్నీ ఉండవు. సీఎం కూడా మామూలు మనిషే. మామూలు మనిషిగానే వస్తా. మిత్రుడు పవన్‌తో పాటు మేమంతా సామాన్య వ్యక్తులుగానే మీ వద్దకు వస్తాం. మీలో ఒకరిగా ఉంటాం. హోదా సేవ కోసమే తప్పు.. పెత్తనం కోసం కాదు. కాన్వాయ్ వచ్చే సమయంలో ప్రజల్ని ఇబ్బంది పెట్టొద్దని చెప్పాం. ఒక సిగ్నల్‌కి మరో సిగ్నల్‌కి గ్యాప్ పెట్టుకోండి. ఐదు నిమిషాలు లేట్ అయినా పర్వాలేదు కానీ.. ప్రజలకు అసౌకర్యం కలగకూడదని స్పష్టంగా ఆదేశించాం. దాడులు చేసి బాధితులపైనే కేసులు పెట్టే పరిస్థితి ఉండదు. ఏ ఒక్కరి ఆత్మగౌరవానికీ భంగం కలగదు. ప్రజాహితం కోసమే పనిచేస్తాం. ప్రతి నిర్ణయం, ప్రతి అడుగు ప్రజల కోసమే ఉంటుంది. 'స్టేట్ ఫస్ట్' అనే నినాదంతో ముందుకెళ్తాం అని ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రానికి సముచిత గౌరవం దక్కింది. ముగ్గురు ఎంపీలు కేంద్రంలో మంత్రులుగా ఉండే అవకాశం వచ్చింది. రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మకు క్యాబినెట్‌లో చోటు కల్పించారు. సాధారణ వ్యక్తిగా ఉన్న శ్రీనివాస వర్మకు భాజపా ఎంపీ టికెట్ ఇచ్చినపుడే ఆశ్చర్యం కలిగింది. ఆ తర్వాత ఆరా తీస్తే పార్టీ కోసం చాలా కష్టపడ్డాడని తెలిసింది. సామాన్య కార్యకర్తను గుర్తించిన పార్టీ భాజపా. తెదేపా, జనసేన కూడా అలా చేస్తున్నాయి. పదేళ్ల మోదీ పరిపాలన దేశప్రతిష్ఠను పెంచింది. ప్రపంచంలో భారతీయులకు గుర్తింపు తీసుకొచ్చింది. మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగబోతోంది. ఆయన కల వికసిత్ భారత్- 2047. మనది వికసిత్ ఆంధప్రదేశ్.. ఈ లక్ష్యంతో ముందుకెళ్లాలి' అని చంద్రబాబు అన్నారు.

# నేడు ఎపికి మోదీ

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నారు. 12వ తేదీ ఉదయం 8.20 గం.లకు ఢిల్లీ నుండి విమానంలో బయలుదేరి ఉ.10.40.గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. ఉదయం 10.55 గం.లకు అక్కడ నుంచి ఐటి పార్కు ప్రాంగణానికి చేరుకుని ఉ.11 నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.40 గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని 12.45 గం.లకు విమానంలో భువనేశ్వర్ బయల్దేరి వెళ్తారు. మోదీ పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. కాగా సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ప్రధాని మోదీతో పాటు, హోం మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. సాధారణంగా ఏదైనా కార్యక్రమానికి మోదీ, అమిత్‌షాల్లో ఒకరు మాత్రమే హాజరు అవుతుంటారు. కానీ దీనికి మాత్రం ఇద్దరూ వస్తున్నారు. ఎన్డీయే కూటమిలో టీడీపీ అధినేత ప్రాధాన్యానికి ఇది నిదర్శనంగా చెబుతున్నారు. మరి కొందరు కేంద్ర మంత్రులు, పొరుగు రాష్ట్రాల సీఎంలు కూడా హాజరవుతున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. తమిళనాడు నుంచి కొందరు మంత్రులతో ఒక సౌహార్ద ప్రతినిధి బృందం హాజరవు తోంది. పోయినసారి జగన్మోహన రెడ్డి ప్రమాణ స్వీకారానికి అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్, తమిళనాడు సీఎం స్టాలిన్ హాజరయ్యారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానాలను ఎన్డీయే కూటమి సీఎంలకే పరిమితం చేయడంతో పొరుగు రాష్ట్రా ముఖ్యమంత్రులు రావడం లేదు. ఈ క్రమంలో తెలంగాణ సిఎం రేవంత్‌కు కూడా ఆహ్వానం పంపకపోవచ్చని తెలుస్తోంది. ప్రమాణస్వీకార వేదికను బాగా విశాలంగా ఏర్పాటు చేస్తున్నారు. సుమారు ఏభై వేల మంది కూర్చోవడానికి వీలుగా మైదానంలో కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. అంతకు మించి వచ్చిన వారు ప్రాంగణం బయట ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వారి కోసం ప్రాంగణం బయట డిజిటల్ తెరలు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ జిల్లాల్లో వస్తున్న స్పందనను బట్టి ఈ సభకు సుమారుగా లక్ష నుంచి లక్షన్నర మంది హాజరు కావచ్చునని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పది వేల వాహనాలు రావచ్చునన్న లెక్కతో వాటికి సరిపోను పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ప్రత్యేక అతిథులుగా జగన్ బాధితులు హాజరవుతున్నారు. జగన్ ప్రభుత్వంలో వేర్వేరు కారణాలతో బాధితులుగా మారిన 112 మందిని గుర్తించి, వారికి ప్రత్యేకంగా ఆహ్వానాలు పంపించారు. కర్నూలు జిల్లాలో పోలీసులు వేధిస్తున్నారంటూ కుటుంబంతో సహా సామూహికంగా ఆత్మహత్య చేసుకున్న అబ్దుల్ సలాం బంధువులను ఈ కార్యక్రమం కోసం పిలిచారు. అలాగే, ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి డోర్ డెలివరీ చేసిన దళిత డ్రైవరు సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులకు ఆహ్వానం అందింది. కరోనా సమయంలో మాస్కులు అడిగిన నర్సీపట్నం డాక్టర్ సుధాకర్‌ను వేధించి ఆయన చావుకు సర్కార్ కారణమైంది. ఆయన కుటుంబసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# ఎన్‌డిఏ మంత్రివర్గం 'పరివార్ మండల్'

## పలువురి పేర్లు ప్రస్తావిస్తూ రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ,జూన్ 11 :** ఆనువంశిక రాజకీయాలపై మోడీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం తూర్పారబట్టారు. ఎన్‌డిఎ మంత్రి వర్గాన్ని 'పరివార్ మండల్' అని ఆయన అభివర్ణించారు. మోడీ 3.0 ప్రభుత్వంలో పలువురు మంత్రులు రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారేనని రాహుల్ పేర్కొన్నారు. 'తరాల పోరాట సంప్రదాయాన్ని, సేవను, త్యాగాన్ని ఆశ్రిత పక్షపాతంగా పేర్కొనేవారు తమ 'సర్కారీ పరివార్'కు అధికార విల్లును పంచిపెడుతున్నారు' అని రాహుల్ 'ఎక్స్' పోస్ట్‌లో ఆరోపించారు. 'మాటలు, చేతలకు మధ్య ఈ తేడా పేరు నరేంద్ర మోడీ' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఎన్‌డిఎ 'పరివార్ మండల్'లో భాగంగా మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ కుమారుడు హెచ్‌డి కుమారస్వామి, మాజీ కేంద్ర మంత్రి మాధవరావు సింధియా కుమారుడు జోతిరాదిత్య సింధియా, అరుణాచల్ ప్రదేశ్ తొలి ప్రో టెమ్ స్పీకర్ రించిన్ ఖరు కుమారుడు కిరణ్ రిజిజు, మహారాష్ట్ర మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే కుమార్తె రక్షా ఖడ్సే, మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ మనుమడు జయంత్ చౌదరి, మాజీ కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్, మాజీ ఎంపి, మధ్య ప్రదేశ్ మంత్రి జయశ్రీ బెనర్జీ అల్లుడు జెపి నడ్డా పేర్లను రాహుల్ తన పోస్ట్‌లో ప్రస్తావించారు.

# మద్యం ప్రియులకు శుభవార్త

అమరావతి,జూన్11(ఆర్‌ఎన్‌ఎ): ఆంధ్రప్రదేశ్‌లోని మద్యం ప్రియులకు శుభవార్తే. గత ఐదేళ్లుగా బ్రాండెడ్ మద్యం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన వారి ఆశలు ఫలించాయి. ప్రభుత్వం మారడంతో బ్రాండెడ్ మద్యం మళ్లీ దిగుమతి అవుతోంది. కొత్త స్టాక్‌తో మద్యం దుకాణాలు కళకళలాడుతున్నాయి. తాజాగా కింగ్‌ఫిషర్ బీర్లు గొడౌన్లకు చేరుకున్నాయి. గోదాములలోకి లారీల నుంచి బీర్లను అన్‌లోడ్ చేస్తున్న వీడియోను టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఏపీ నుంచి మాయమైపోయిన బీర్లు మళ్లీ వచ్చాయని ఆయన దానికి క్యాప్షన్ జోడించారు. ఈ వీడియోపై నెటిజన్లు సంతోషం వ్యక్తంచేస్తూ కామెంట్లు పెడుతున్నారు. కింగ్‌ఫిషర్ ఒక్కటే కాదని, పలానా బ్రాండ్లు కావాలంటూ వాటి లిస్ట్ కూడా పెడుతున్నారు. దీనికి స్పందించిన ఆనం.. త్వరలోనే అన్ని మద్యం బ్రాండ్లు దొరుకుతాయని పేర్కొన్నారు. మరోవైపు, ఇష్టమైన మద్యం మళ్లీ అందుబాటులోకి వస్తుండడంతో నెటిజన్లు మీమ్స్‌తో సెలబ్రేట్ చేసుకుంటున్నారు.

# నిజాయితీకి నిలువుటద్దం కొణతాల

- ఉత్తమ పార్లమెంటేరియన్ గా గుర్తింపు
- ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర మంత్రిగా ఉత్తమ సేవలు

**విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** అనకాపల్లి అసెంబ్లీ నుంచి 2024 మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందిన కొణతాల రామకృష్ణ గుడ్ విల్ నేటికీ చెక్కుచెదరలేదు. ఎం కామ్ చదివి విద్యావంతుడైన కొణతాల రామకృష్ణ, తండ్రి కొణతాల సుబ్రహ్మణ్యం ప్రముఖ వ్యాపారి కాంగ్రెస్ వాది అవడంతో కాంగ్రెస్ పార్టీలో 1980వ దశకంలో చేరాడు. 1989లో అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుండి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీకి చెందిన పి.అప్పలనరసింహంపై కేవలం 9 ఓట్ల మెజారిటీతో గెలిచి 9వ లోక్‌సభకు ఎన్నికై, అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ దృష్టిలో పడ్డారు . తిరిగి 1991లో పదవ లోక్‌సభకు అనకాపల్లి నియోజకవర్గం నుండి ఎన్నికైనాడు. 1990, 1992 సంవత్సరాలలో విశాఖపట్నం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైనాడు. 1996లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో చింతకాయల అయ్యన్నపాత్రుడు చేతిలో పరాజయం పాలయ్యాడు. 1999లో అనకాపల్లి శాసనసభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీతరపున పోటీచేసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దాడి వీరభద్రరావు చేతిలో ఓడిపోయాడు. తిరిగి 2004లో దాడి వీరభద్రరావుపై 17వేల ఓట్ల ఆధిక్యంతో గెలిచి శాసనసభ సభ్యుడిగా ఎన్నికై ఉమ్మడి ఆంధ్రాలో మూడు శాఖలు నిర్వహిస్తూ ఉత్తమ మంత్రిగా సమర్థవంతమైన సేవలు అందించారు . తిరిగి 2009లో శాసనసభకు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసి ప్రజా రాజ్యం పార్టీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు,తెలుగు దేశం అభ్యర్థి దాడి వీరభద్రరావు,తనకు మధ్య జరిగిన త్రిముఖ పోరు స్వల్ప ఓట్లు తేడ తో గంటా శ్రీనివాసరావు గెలిచాడు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో వాణిజ్య పన్నుల శాఖ, న్యాయశాఖ, ఎక్సైజ్ శాఖల మంత్రిగా పనిచేసే ఆంధ్ర ప్రజలకు సుపరిచితుడయ్యారు.



రాజశేఖరరెడ్డికి సన్నిహితుడైన కొణతాల రామకృష్ణ, రాజశేఖర్ రెడ్డి మరణానంతరం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచి వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీలో చేరాడు. 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో విశాఖ పార్లమెంటు ఇన్‌ఛార్జిగా వ్యవహరించాడు. ఇతని తమ్ముడు కొణతాల రఘునాథ్ అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశాడు. విశాఖ ఎంపీగా పోటీకి దిగిన వై. ఎస్. విజయమ్మ ప్రచారంలో అన్నీ తానై వ్యవహరించాడు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా రాజకీయాల్లో ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. కొణతాల పుట్టిన గవర సామాజిక వర్గంతో పాటు, ఇతర కులాల్లో కూడా ఫాలోయింగ్‌ను పెంపొందించుకున్నారు . రైతు బాంధవుడుగా రైతు ఉద్యమ నేతగా, రైతుల కోసం అహర్నిశలు శ్రమించిన కొణతాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో నుంచి గెలుపొందిన కొణతాలకు రాష్ట్ర మంత్రివర్గంలో మంచి మంత్రి పదవి వస్తుందని నియోజకవర్గ ప్రజలు ఆశిస్తున్నారు.

**కార్యకర్తలను నేతలుగా తీర్చిదిద్దిన కొణతాల**

సాధారణంగా రాజకీయ నాయకులు తమ అనుచరులను నేతలుగా తయారుచేయడానికి ఇష్టపడరు. ఎందుకంటే భవిష్యత్లో తమకు పోటీ వస్తారనే భయంతో... ఇందుకు భిన్నంగా గతంలో ద్రోణంరాజు సత్యనారాయణ జిల్లాలో అనేక మంది సామాన్యులను నేతలుగా తీర్చిదిద్దారు. నేటి తరంలో కొణతాల రామకృష్ణ అదే స్ఫూర్తితో ఎందరో కార్యకర్తలను జిల్లా, రాష్ట్రస్థాయి నేతలుగా తీర్చిదిద్దారు. గిరిజన మహిళ అయిన శ్రీమతి వంజంగి కాంతమ్మ, సాధారణ రైతు కుటుంబానికి చెందిన గొర్లె రామ్మూర్తినాయుడు లను జిల్లా పరిషత్ చైర్మన్లుగా చేసారు. గిరిజన ప్రాంతానికే చెందిన యువకుడు కిడారి సర్వేశ్వరరావును ఏకంగా ఎమ్మెల్సీగా గెలిపించారు. పసుపులేటి బాలరాజును మంత్రిగా, గండి బాబ్జీని ఎమ్మెల్యేగా, తుమ్మపాలకు చెందిన డి.వి.వి.గోపాలరాజు ను మార్కెఫెడ్ చైర్మన్ గా , పులుసు జనార్ధన్ రావును విశాఖ నగర మేయర్ గా , గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా తోట నగేష్, అనకాపల్లికి చెందిన కడిమిశెట్టి వెంకట మహాలక్ష్మి, కొణతాల జగన్నాథరావు నాయుడు లను పురపాలక సంఘం చైర్మన్లుగా చేసారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో మరెందరో కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో మంచి గుర్తింపు పొందారు. కొణతాల రామకృష్ణ అప్పటినుంచి ఇప్పటివరకు రాజకీయాల్లో అవినీతి మచ్చలేని నాయకుడిగా వెలుగొందుతున్నారు. అందుకే నిజాయితీకి నిలువుటద్దంగా మారుపేరుగా కొణతాల రామకృష్ణను చెప్పుకోవచ్చు.

## భూమన రాజీనామా ఆమోదం



**తిరుపతి, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** టిటిడి ఛైర్మన్ పదవికి వైసీసీ సీనియర్ నేత భూమన కరుణాకర్ రెడ్డి చేసిన రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుండడంతో టీటీడీ చైర్మన్ పదవికి ఆయన రాజీనామా చేశారు. కరుణాకర్‌రెడ్డి రాజీనామాను దేవాదాయ శాఖ కార్యదర్శి కరికాల వల్లవన్ ఆమోదించారు. ఈ మేరకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గతేడాది ఆగస్టు నెలలో టీటీడీ చైర్మన్‌గా భూమనకరుణాకర్ రెడ్డి నియమితు లయ్యారు. అంతకుముందు 2006– 2008 మధ్య కూడా టీటీడీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో భూమన తన పదవికి రాజీనామా చేశారు.

### కష్టాల్లో ఉన్న ఏపీని గాడిలో పెట్టే బాధ్యత

# చంద్రబాబుదే

గత ఐదేళ్లు విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నాం

బాబు అనుభవం ఏపీ అభివృద్ధికి దోహదపడుతుంది

కలసికట్టుగా కూటమిని గెలిపించాం... అభివృద్ధి చేసి చూపుదాం

కూటమి భేటీలో జనసేనాని పవన్ కళ్యాణ్ వెల్లడి



**అమరావతి, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ విపత్కర పరిస్థితులు ఎదుర్కొందని జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నారు. ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రబాబు పేరును పవన్ ప్రతిపాదించారు. కష్టాల్లో ఉన్న ఏపీని గాడిన పెట్టేందుకు చంద్రబాబు లాంటి అనుభవజ్ఞుడైన నాయకుడు అవసరం అని చెప్పారు. అనంతరం చంద్రబాబును పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. విజయవాడ ఏ కన్వెన్షన్ హాలులో మంగళవారం ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. చంద్రబాబును ఎన్డీయే కూటమి శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల్లో కూటమి అద్భుత మెజార్టీతో 164 అసెంబ్లీ స్థానాలు, 21 లోక్ సభ స్థానాలను దక్కించుకుందని జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ విజయం దేశం మొత్తానికి స్ఫూర్తినిచ్చిందని చెప్పారు. 'కూటమి ఎలా ఉండాలో అందరం కలిసికట్టుగా చూపించాం. కక్ష సాధింపులు, వ్యక్తిగత దూషణలకు సమయం కాదు. 5 కోట్ల మంది ప్రజలు మనందరిపై నమ్మకం పెట్టుకున్నారు. అభివృద్ధిని సమష్టిగా ముందుకు తీసుకెళ్లాలని పవన్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపా కూటమి కలిసి కట్టుగా పోరాడి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుందని చెప్పారు. కూటమి శాసన సభాపక్ష నేతగా చంద్రబాబు పేరును ప్రతిపాదించిన అనంతరం పవన్ మాట్లాడారు. 'తెదేపా, జనసేన, భాజపా ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు. అందరం కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన మెజారిటీలతో గెలిచాం. 164 శాసనసభ స్థానాలు, 21 ఎంపీలను ఎన్డీయే కూటమి దక్కించుకుంది. అద్భుతమైన విజయం ఇది. కూటమి అంటే ఎలా ఉండాలో రాష్ట్ర ప్రజలు కలిసికట్టుగా చూపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వం అని ఇప్పటం సభలో చెప్పాం.. అదే మాటపై నిలబడ్డాం. ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం.. తగ్గాం.. ప్రజల్లో నమ్మకాన్ని పెంచి అద్భుతమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని స్థాపించబోతున్నాం. కక్ష సాధింపులకు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదు. మనందరం సమష్టిగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, శాంతి భద్రతల విషయంలో బలంగా నిలబడతామని చెప్పాం. ఉమ్మడి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను బాధ్యతగా ముందుకు తీసుకె ళ్లాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సమయంలో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయ కుడు కావాలి. నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అపారమైన అవగా హన, పెట్టుబడులను తీసుకొచ్చే సమర్థత, ప్రతిభ, విదేశాల అధ్యక్షులను తెలుగు రాష్ట్రాల వైపు దృష్టి మళ్లించే శక్తి ఉన్న చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరం. ఆయన నలిగిపోయారు. జైల్లో చూశాను. అప్పుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పడిన బాధను చూశాను. మంచిరోజులు వస్తాయి.. కన్నీళ్లు పెట్టొద్దని చెప్పాను. చంద్రబాబుకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నా.. అద్భుతమైన పాలన అందివ్వాలని కోరుకుంటున్నా అని చెప్పారు. ఈ సందర్భంగా పవన్‌ను చంద్రబాబు ఆలింగనం చేసుకుని ధన్యవాదాలు తెలిపారు.

### కూటమిపై ప్రజల విశ్వాసానికి

# కట్టుబడి ఉంటాం

వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

బిజెపి ఎమ్మెల్యేల భేటీలో పురంధేశ్వరి



**విజయవాడ, జూన్ 11 (ఆంధ్రపత్రిక):** కూటమిపై ప్రజల విశ్వాసం ఉంచి భారీ మెజార్టీతో గెలిపించారని, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, బిజెపి ఎమ్మెల్యేల భేటీలో పురంధేశ్వరి అన్నారు. ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మంగళ వారం ఉదయం పార్టీ రాష్ట్ర కార్యాల యంలో బీజేపీ ఎమ్మెల్యేలతో సమావేశం అయ్యారు. శాసన సభ పక్ష నేత ఎంపికపై చర్చలు జరిపారు. అధిష్టా నం ప్రకటనకు అందరూ కట్టుబడి ఉండాలని నిర్ణయించారు. అనంతరం పురందేశ్వరి పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి కూటమి సమావేశం జరుగుతున్న ఎ కన్వెన్షన్‌కు బయలుదేరి వెళ్లారు. సందర్భంగా దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు కూటమిపై విశ్వాసంతో మంచి విజయం అందించారని అన్నారు.

బుధవారం చంద్రబాబు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వస్తున్నారని, రాష్ట్ర బీజేపీ పక్షాన తామంతా ఆ సభలో పాల్గొంటామని దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు.































Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com